
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 16 ఫిబ్రవరి 2025





గ్రిడ్ అనుసంధానంపై.. అధ్యయనం

30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లల పరిధిలోని పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నాయి. జనాభాతో పాటు అవసరాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించారు. ఉదాహరణకు నరసరావుపేటలో రోజుకు ప్రస్తుతం 22 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న 30 ఏళ్లకు మరో 15 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఇలా 37 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండటంతో ఆ మేరకు పైపులైన్లను నరసరావుపేటకు అనుసంధానం చేస్తారు. ఇదే తరహాలో గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఏ మేరకు నీటి అవసరమో ప్రాథమికంగా గుర్తించారు. నీటి సరఫరా, పైపులైన్ సామర్థ్యం పరిగణనలోకి తీసుకుని గ్రిడ్ వ్యయ అంచనాలు రూపొందిస్తారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు వాటర్ గ్రిడ్ పల్లెలకే పరిమితం కాగా దానిని మున్సిపాలిటీలకు కూడా అనుసంధానం చేసేందుకు కసరత్తు చేస్తోంది. రూ.1,200 కోట్ల వ్యయం కాగల తొలివిడత పనులకు గ్రామీణ నీటిసరఫరా శాఖ టెండర్లు నిర్వహించి పల్నాడు జిల్లా పరిధిలోని 10 మండలాల్లోని అన్ని గ్రామాలకు రక్షిత నీరు అందించేందుకు సమాయత్తమైంది. ఈ తరుణంలో ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. పల్లెలతో పాటు పట్టణాల్లో రక్షిత నీటి పథకాలను వాటర్ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ శాఖలను ఆదేశించింది. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్లు సోమవారం గుంటూరులో భేటీ (మిగతా 8వ పేజీలో)

పల్లెలు.. పట్టణాలు అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ తాగునీటికి అవస్థలే. కొన్ని ప్రాంతాల్లో అయితే ఫ్లోరైడ్ సమస్య.. వీటన్నింటికీ చెక్ చెప్పేలా.. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా.. సురక్షిత నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేసేలా.. వాటర్ గ్రిడ్‌ను మున్సిపాలిటీలకూ అనుసంధానం చేయనున్నారు. ఇప్పటి వరకు వాటర్‌గ్రిడ్ పల్లెలకే పరిమితం కాగా దానిని మున్సిపాలిటీలకు అనుసంధానం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో అనుసంధానంపై అధ్యయనానికి ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు సోమవారం గుంటూరులో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ సమావేశంలో వాటర్ గ్రిడ్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించి నివేదికలను ప్రభుత్వానికి అందించనున్నారు.

- అమృత్ 2.0 పనులూ వాటర్ గ్రిడ్‌లోకి..
- పురాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ప్రణాళికలు సిద్ధం చేసిన కూటమి ప్రభుత్వం
- రేపు గుంటూరులో పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ల భేటీ
- వారంలో వాటర్ గ్రిడ్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- గ్రిడ్‌కు అమృత్ 2.0 జలజీవన్ మిషన్ నుంచి నిధులు



గ్రిడ్ నిర్మాణం.. గ్రావిటీ ద్వారా సరఫరా

రక్షిత తాగునీటిని అందించడమే వాటర్ గ్రిడ్ లక్ష్యం. చాలా గ్రామాల్లో తాగునీటి పథకాలు బోరు నీటిపై ఆధారపడ్డాయి. బోరు నీటిని వినియోగించరాదని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో గ్రామాలకు, పట్టణాలకు నాగార్జున సాగర్ నుంచి కృష్ణా జలాలను సరఫరా చేసే విధంగా వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టారు. సాగర్ వద్ద నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించి పైపులైన్ల ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని గ్రిడ్‌ను రూపకల్పన చేశారు. అయితే ప్రస్తుతం గ్రిడ్‌ను మున్సిపాలిటీలకూ అనుసంధానం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు పైపులైన్ నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. సాగర్ నుంచి కారంపూడి వరకు ప్రధాన పైపులైన్ నిర్మించి అక్కడ వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్ల వైపునకు పైపులైన్లు ఏర్పాటు చేస్తారు. ఇలా ప్రతి పట్టణానికి, గ్రామాలకు పైపులైన్లను అనుసంధానం చేస్తారు. దీంతో ప్రత్యేకంగా చెరువుల్లో తాగునీటిని నిల్వ చేసే అవసరం ఉండదు. పైపులైన్ ద్వారా నేరుగా ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని ఎక్కిస్తారు. ఆ ట్యాంకు నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్ల ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేస్తారు. దీని వల్ల వేసవిలో కూడా తాగు నీటి ఇబ్బందులు ఉండవు. పుష్కలంగా తాగునీటి సరఫరాకు వాటర్‌గ్రిడ్ దోహదపడు తుంది. ఈ బృహత్తర పథకానికి కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. గ్రావిటీపై నీటి సరఫరా చేయవచ్చని ఇంజనీర్లు చెబుతున్నారు.

మునిసిపాల్టీల వారీగా అమృత్ పథకంలో చేపట్టే పనులకు వ్యయం అంచనా వివరాలు..

మునిసిపాల్టీ	వ్యయం అంచనా రూ కోట్లలో
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	23.82
చిలకలూరిపేట	116.80
వినుకొండ	29.57
దాచేపల్లి	6.11
పిడుగురాళ్ల	24.77
గురజాల	3.17
మాచర్ల	37.53
గుంటూరు జిల్లా..	
గుంటూరు	363.23
మంగళగిరి, తాడేపల్లి	60.63
తెనాలి	2.25
పొన్నూరు	19.06
బాపట్ల జిల్లా..	
చీరాల	31.43
బాపట్ల	23.38
రేపల్లె	41.64

పోషణ.. అంతంతే



- 72 శాతం మందికే పోషకాహారం
- ధర పెరిగిందని కోడిగుడ్లలో కోత
- అంగన్వాడీలకు అరకొరగా సరుకులు
- సరుకులు అందక లబ్ధిదారులు ఇబ్బందులు

(గుంటూరు -ఆంధ్రజ్యోతి)

మంగళగిరిలోని అంగన్వాడీ కేంద్రానికి కోడిగుడ్లు తక్కువగా వచ్చాయి. ఒక్కో లబ్ధిదారుకు నెలకు 25 గుడ్లు చొప్పున ఇవ్వాల్సి ఉండగా తక్కువ సంఖ్యలో గుడ్లు రావడంతో వచ్చినవాటినే సరిపుచ్చి సిబ్బంది చేతులెత్తేశారు. కందిపప్పు, బియ్యం కూడా తక్కువగా రావడంతో వాటినే సర్దుబాటు చేయాల్సి వచ్చింది.

గుంటూరులోని ఓ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇచ్చే బాలామృతం తక్కువగా వచ్చింది. మిగిలినవారికి, కొత్తగా చేరిన వారికి బాలామృతం అందలేదు.

.. ఇది ఏదో ఒక్క అంగన్వాడీ కేంద్రంలో సమస్య అనుకుంటే పొరపాటే. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషణ ప్రక్రియ నెలనెలా నీరసించిపోతోంది. ఐసీడీఎస్ లెక్కలు చూస్తే గత కొన్ని నెలలుగా మూడు జిల్లాల్లోని అంగన్వాడీ లబ్ధిదారుల్లో 72 శాతం మందికి మాత్రమే పోషకాహారం అందుతుందని తెలుస్తోంది. వైసీపీ హయాంలో దెబ్బతిన్న పోషణ వ్యవస్థ కూటమి ప్రభుత్వం రాకతో ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందనుకుని లబ్ధిదారులు భావిస్తున్నారు. సరిగ్గా ఈ సమయంలోనే తిరిగి పాత సమస్యలే తలెత్తుతుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

● ఈ- కేవైసీతో అందకుండా పోతున్న బాలామృతం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ- కేవైసీ విధానంతో చిన్నారులకు బాలామృతం అందకుండా పోతోంది. చిన్నారులకు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ వంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో చిన్నారులకు ఈ-కేవైసీ జరగడం లేదు. దీంతో వారికి బాలామృతం అందకుండానే పోతోంది. ఒక వేళ ఈ కేవైసీ పూర్తయినా అది ప్రతి నెలా 20 లోపే చేయాలి. అలా నమోదైతేనే ఆ మరుసటి నెలలో చిన్నారికి బాలామృతం అందుతుంది. లేదంటే మరో నెల వేచి చూడాల్సిందే. అలా ప్రతి నెలా 20 నుంచి 25 శాతం మందికి బాలామృతం అందడం లేదని తెలుస్తోంది. సగటున ఒక్కో అంగన్వాడీ కేంద్రంలో 50 మంది చిన్నారులు ఉంటే, 38 బాలామృతం ప్యాకెట్లు మాత్రమే వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. గతంలో ఏ నెలకి ఆ నెల అంగన్వాడీ (మిగతా 8వ పేజీలో)

● యాప్ ట్రాకింగ్‌తో.. అరకొర సరుకులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 5,339 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మూడున్నర లక్షల మంది మహిళలు, 1.50 లక్షల మంది చిన్నారులు పోషణ పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం యాప్ ద్వారా పోషణను అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని, ఎఫ్ఆర్ఎస్ ద్వారా పోషణ అందిస్తోంది. ఆయా యాప్‌లలో నమోదైన వారికి మాత్రమే ప్రతి నెలా పోషణ అందుతుంది. ప్రతి నెలా 20 నుంచి 25వ తేదీ లోపు నమోదు కాని పక్షంలో రెండో నెల నుంచి వారికి పోషణ సరఫరా అవుతుంది. సాధారణంగా బాలింతలు, గర్భిణులు విశ్రాంతి కోసం, సంప్రదాయం ప్రకారం పుట్టిళ్లకు వెళుతుంటారు. అలా వెళ్లిన సందర్భంలో వారికి అక్కడ సమీపంలో ఉన్న అంగన్వాడీల్లో పోషణ పొందే అవకాశం ఉంటుంది. గతంలో వారి పేర్లు రిజిష్టర్లో నమోదు చేసుకుని వెంటనే బాల సంజీవని, రాగిపిండి, చిక్కీలు, అటుకులు, ఎండు ఖర్జూరం అందించేవారు. తాజా విధానం ప్రకారం వారు పుట్టింటికి వెళ్లినా, అక్కడి నుంచి తమ ఇంటికి తిరిగి వచ్చిన సందర్భాల్లో ఆయా అంగన్వాడీల్లోని యాప్‌లలో నమోదైన మరుసటి నెల నుంచి మాత్రమే సరుకులు అందుతాయి. ఈ విధానంతో అనేకమంది మహిళలు, చిన్నారులు నష్టపోతున్నారు.



షేర్ ధనం పది శాతం.. వడ్డీ భారం

సహకార పరపతి సంఘాల్లో రైతులకు దీర్ఘకాలిక రుణాలు, క్యాష్ క్రెడిట్, పంట రుణాలు ఇస్తున్నారు. వీటిలో పంట రుణం కింద రూ.3 లక్షలు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.10 లక్షలు ఇస్తున్నారు. తీసుకున్న రుణంలో 10 శాతం షేర్ ధనం కింద సహకార బ్యాంకు మినహాయించుకుంటుంది. ఉదాహరణకు రైతు రూ.10 లక్షలు దీర్ఘకాలిక రుణం తీసుకుంటే రూ.లక్ష వరకు షేర్ ధనం కింద మినహాయిస్తారు. బ్యాంకు మినహాయించిన రూ.లక్షకు కూడా రైతే వడ్డీ చెల్లించాలి.

సహకారం మాకొద్దు

- సొసైటీలకు రైతులు గుడ్‌బై
- ఖాతాలు రద్దు చేసుకుంటోన్న వైనం
- మోయలేని భారంగా సహకార రుణాలు
- జీవో 472కు విరుద్ధంగా పెద్దఎత్తున వసూళ్లు

జగన్ ప్రభుత్వం వచ్చాక అదనపు ఫీజులు మోత

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

స్టాంపు డ్యూటీ రూ.1500.. బాండ్‌కు రూ.1500.. రూ.3 లక్షల రుణానికి రూ.30 వేలు షేర్ ధనం.. రుణం రద్దు కోసం రూ.4500 చెల్లింపు.. ఇవి కాక రుణం కోసం బ్యాంకుల చుట్టూ పలుసార్లు తిరుగుడు.. ఆ పత్రాలు.. ఈ పత్రాల వ్యయం అదనం.. ఇదీ సహకార సంఘాల్లో రుణం తీసుకునే రైతులపై పడుతున్న భారం. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి రైతులకు రక్షణ కోసం ఏర్పాటైన సహకార సంఘాలు అందుకు పూర్తి విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రుణాలకు పడే భారాన్ని భరించలేక సహకార సంఘాలకు రైతులు గుడ్‌బై చెప్పేస్తున్నారు. పెదకాకాని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) నుంచి సుమారు 80 మంది రైతులు ఏకకాలంలో వైదొలగారు. అంతేగాక అక్కడ ఉన్న రుణ ఖాతాలను కూడా రద్దు చేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు ఆకస్మికంగా బయటకు వెళ్లిపోయారు. నాలుగైదేళ్లుగా ఈ సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తుంది. ఇందుకు కారణంపై ఆరా తీస్తే.. గతంలో ఎన్నలూ లేనివిధంగా సొసైటీల్లో రైతులకు ఇచ్చే రుణాలపై ఎడాపెడా ఫీజులు వసూలు చేయడమేనని తెలుస్తోంది. వ్యవసాయ రుణాల మంజూరు సమయంలో స్టాంపు డ్యూటీ, బాండ్, షేర్ ధనం ఇలా వివిధ రకాల పేర్లతో రైతుపై అదనపు భారాన్ని మోపడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల పర్వానికి తెరలేవగా కూటమి ప్రభుత్వంలోనూ అది కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో రుణాల నిమిత్తం చెల్లించే ఫీజుల భారాన్ని మోయలేక రైతులు సొసైటీలకు గుడ్‌బై చెప్పేస్తున్నారు. వందల సంఖ్యలో రైతులు ఖాతాలు రద్దు చేసుకుంటే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల మనుగడ కష్టమేనని పలువురు అంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటికే 60 సహకార పరపతి సంఘాలు తీవ్ర నష్టాల్లో ఉన్నాయి. ఒకేసారి వందలాది మంది రైతులు బయటకు వెళ్తే మిగిలిన సొసైటీలు కూడా అదే బాట పట్టాల్సి వస్తుంది.

రైతుపై భారం తగ్గించాలి



సహకార పరపతి సంఘాల్లో రుణాలు పొందడానికి రైతులు చాలా భారం భరిస్తున్న మాట వాస్తవమే. ఇప్పటికైనా రైతులపై పడే భారాన్ని తగ్గిస్తే బాగుం టుంది. దానివల్ల సొసైటీల మనుగడకు కూడా ఇబ్బంది కలగదు. రైతులు బయటకు వెళ్లిపోతే ఇబ్బందులకు దారి తీస్తుంది.

- మువ్వా వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు, సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్

జీవోకు జగన్ పాతర

సహకార పరపతి సంఘాల ద్వారా రైతులు తీసుకునే రుణాలకు స్టాంపు డ్యూటీ వసూలు చేయవద్దని 1982లో జీవో 472ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ జీవోను అమలు చేస్తూ వచ్చాయి. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత జీవోకు పాతర పడింది. సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకునే రుణాలకు 0.5 శాతం స్టాంపు డ్యూటీ వసూలు చేయడం ప్రారంభించారు. రూ.3 లక్షల రుణానికి రూ.1500 వరకు చలానా కట్టిస్తున్నారు. గతంలో రుణం పొందేందుకు అవసరమైన బాండ్‌కు కూడా ఏవిధమైన ఫీజు వసూలు చేయలేదు. వైసీపీ ప్రభుత్వం బాండ్‌కు రూ.1500 ఫీజుగా నిర్ణయించింది. సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న రుణాన్ని రద్దు చేసుకునే సమయంలో కూడా ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. రుణాన్ని రద్దు చేసే సమయంలో రూ.4500 వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని సంఘాల్లో అయితే అంతకంటే ఎక్కువే ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇన్ని విధాలా ఖర్చులు ఉండటం వల్ల రైతుపై ఎక్కువ భారం పడుతుంది. ఫీజులు, ఇతర ఖర్చులను లెక్కేస్తే తీసుకున్న రుణానికి వడ్డీ ఎక్కువగానే పడుతున్నట్లు అర్థం అవుతుంది.

466.35 ఎకరాలు.. రూ.181 కోట్లు

- పంప్‌హౌస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- పోలవరం - బనకచర్ల అనుసంధానంలో ముందడుగు

నకరికల్లు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధానంలో ముందడుగు పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పనులు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ పనుల్లో కదలిక వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి మెగా, నవయుగ ఇంజనీరింగ్ కంపెనీలకు అప్పగిం చింది. తొలి దశలో కృష్ణా నది నుంచి సాగర్ కుడి కాల్వలోకి నీటిని ఎత్తి పోసే పనులు మొదలయ్యాయి. ఐదు పంపుహౌస్‌ల నిర్మాణం దిశగా చర్యలు చేపట్టారు. గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించిన వైకుంఠపురం వద్ద కృష్ణా నది నుంచి తోడి నకరికల్లు మండలం నరసింగపాడు వద్ద 80వ కిలోమీటరు సాగర్ కుడి కాల్వలో పోస్తారు. ఇందుకోసం ఐదు చోట్ల పంపు హౌస్‌లను నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. తొలుత పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐదు పంపుహౌస్‌ల నిర్మాణానికి 466.35 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ భూసేకరణకు రూ.181 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆ మోదించింది. దీంతో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది.

పంప్‌హౌస్‌లు ఇలా..

- మొదటిది: అమరావతి మండలం వైకుంఠపురం వద్ద
- రెండోది: లింగాపురంలో 11.5 కిలో మీటరు వద్ద
- మూడోది: క్రోసూరులో 35.25 కిలో మీటరు వద్ద
- నాల్గోది : రాజుపాలెంలో 47.25 కిలో మీటరు వద్ద
- ఐదోది: నకరికల్లు మండలం నరసింగపాడులో 65.45 కిలో మీటరు వద్ద

నకరికల్లు మండలంలో భూసేకరణ

ఈ ప్రాజెక్టు కింద నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో 78 ఎకరాల ప్రభుత్వ భూమి వినియోగించనున్నారు. నకరికల్లు పరిధిలో 283 ఎకరాలు, నరసింగపాడులో 341.91 ఎకరాలను సేకరించాల్సి ఉంది. నరసింగపాడులో పంపు హౌస్ నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రావిటీ ద్వారా కాల్వ తీసేందుకు 190 ఎకరాలను సేకరించాల్సి ఉంది. కాగా జలవనరుల శాఖ అధికారులు రెవెన్యూ అధికారులతో భూసేకరణకు చర్చలు జరుపుతున్నారు.

ఎకరాకు రూ.50 లక్షలు కావాలి

ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని పోలవరం-బనకచర్ల అనుసంధానంలో భూములు కోల్పోతున్న నరసింగపాడు రైతులు కోరుతున్నారు. తమ భూములు సారవంతమైనవే కాకుండా తమ జీవనాధారమని రెండు పంటలు పండుతాయని ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమకు ఆమోదయోగ్యం కాదంటున్నారు. భూముల పరిహార విషయంపై రైతులు అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు.

ధాన్యం సేకరణ 70 వేల టన్నులు


- 50,000 టన్నుల నుంచి దఫదఫాలుగా పెంపు
- పెద్దసంఖ్యలో కొనుగోలు కేంద్రాల బాట పడుతున్న రైతులు
- ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో లక్ష టన్నులకు చేరే అవకాశం
- గడచిన ఐదేళ్లలో ఎప్పుడూ 30,000 టన్నులకు మించని సేకరణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఈ సారి మద్దతు ధరకు ధాన్యం సేకరణ రికార్డులను అధిగమిస్తోంది. 48 గంటల్లోగానే ఖాతాల్లో నగదు జమ.. తేమ శాతం నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరిస్తుండటంతో రైతులు తమ ధాన్యాన్ని ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. మరోవైపు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధర తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో మద్దతుధరపై రైతుల్లో ఆశలు చిగురించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. అంచనాలకు మించి ధాన్యం రావడంతో ఓ దశలో అధికారులు ఒత్తిడికి లోనయ్యారు. సేకరణ లక్ష్యాల పెంపుదలపై రైతుల నుంచి ప్రజాప్రతినిధులకు ఒత్తిడి తీవ్రమైంది. ఇప్పటికే 70,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించిన సివిల్ సప్లయిస్ విభాగం, ప్రక్రియ ముగిసే నాటికి లక్ష టన్నులను సేకరిస్తామంటోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క సీజన్‌లో కూడా 30,000 టన్నులకు మించని ధాన్యం సేకరణ.. కూటమి ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌లోనే లక్ష టన్నుల వరకు సేకరించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచీ సవాళ్లే...

సరిగ్గా ధాన్యం సేకరణ ప్రారంభమయ్యే నాటికి అప్పటి వరకు సివిల్ సప్లయిస్ డీఎంగా విధుల్లో ఉన్న అధికారిపై ఆరోపణలతో ఆయనను కలెక్టర్ వెంకటమురళి సరెండర్ చేశారు. డీఎస్‌వోకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సరిపడా సిబ్బంది లేరు. ప్రభుత్వం తొలుత ఇచ్చిన ధాన్యం సేకరణ లక్ష్యం 50,000 టన్నుల నెల రోజులకే పూర్తి అయింది. రైతుల అభ్యర్థనలతో అదనంగా కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని డీఆర్సీలో తీర్మానం చేయాల్సి వచ్చింది. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చారు. దీంతో దఫాదఫాలుగా మరో 20,000 సేకరణకు అనుమతి తెగలిగారు. దీంతో 70,000 టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయిస్ విభాగం సేకరించగలిగింది. ఇంకా 90,000 టన్నుల ధానం రైతుల వద్ద ఉంది. ఈ క్రమంలో మరో 30,000 టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ పరిస్థితుల్లో మరో మూడు వారాలు కొనుగోలు కేంద్రాలు ఉంటాయని సేకరణ లక్ష టన్నుల వరకు చేరుతుందనే ధీమాను అధికారులు వ్యక్తం చేస్తున్నారు.



తెలుగు నాటకాన్ని ప్రోత్సహించండి

● రంగస్థలి వార్షికోత్సవ సభలో ఎంపీ లావు



సభలో మాట్లాడుతున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటకాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవ రాయలు కోరారు. శనివారం భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరుగుతున్న నరసరావుపేట రంగస్థలి 45వ వార్షికోత్సవం, 24వ జాతీయ స్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీల రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ జీవితాన్ని కళలు ప్రతిబింబిస్తాయని, సమాజంలో ఉన్న సమస్యలను ఎత్తిచూపుతూ కళలు చైతన్యాన్ని కలిగిస్తాయన్నారు. కమ్యూనిస్టులు కళల ద్వారానే సమస్యలను పాలకులకు ఎత్తి చూపేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం వైపు నుంచి ఏ సహకారం కావాలన్నా, తన దృష్టికి తెస్తే తప్పకుండా సహాయ సహకారం అందిస్తానని నిర్వాహకులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా రంగస్థలి ప్రతిభా పురస్కారం ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకులు చలసాని కృష్ణ ప్రసాద్‌కు అందజేశారు. పురస్కార గ్రహీతను ఎంపీ లావు చేతుల మీదుగా సత్కరించారు. ఆత్మీయ అతిథులు ఎం.ఎ.ఎం కళాశాలల చైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ బిఆర్ సుషీల్‌కుమార్‌లను రంగస్థలి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. రెండో రోజు ప్రదర్శించిన కళాంజలి, హైదరాబాద్ వారి అన్నదాత నాటిక ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రెండో ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటిక ఆలోచింపచేసింది. కపలవాయి రాజేంద్రప్రసాద్. రాకీ మీడియా అధినేత నల్లపాటి రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు. రంగస్థలి మాజీ అధ్యక్షుడు కిలారు వెంకట్రావ్ అధ్యక్షత వహించగా, రంగస్థలి కార్యవర్గ సభ్యులు కార్యక్రమాలు నిర్వహించారు.

మెప్మాలో వెలుగు చూస్తున్న అక్రమాలు

● గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి

అనర్హులకు పెద్దఎత్తున రుణాలు

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని మెప్మా విభాగంలో బినామీల అక్రమాలు బయటపడుతున్నాయి. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులను గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి బ్యాంక్ రుణాలు ఇప్పించి గృహాలు నిర్మించుకునే విధంగా ప్రోత్సహించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. దీంతో అర్హులతోపాటు అనర్హులను కలిపి గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి పెద్దఎత్తున రుణాలు ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2022 - 2023 సంవత్సరంలో సుమారు 62 స్వయం సహాయక సంఘాలు నూతనంగా ప్రారంభించారు. వీరికి సుమారు రూ.5 కోట్ల రుణాలుగా ఇచ్చారు. వీరిలో ఎక్కువ మంది బినామీలుగా ఉన్నట్లు సమాచారం. కొంతమంది 5 నుంచి 6 గ్రూప్‌లలో ఉన్నట్లు తెలిసింది. తీసుకున్న రుణం సకాలంలో చెల్లిస్తూ వస్తే ఏ ఇబ్బంది ఉండేది కాదు. బ్యాంక్ రుణాలు మాఫీ చేస్తారనే ఆలోచనతో పెద్దఎత్తున రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా ఉండిపోయారు. తీరా బ్యాంక్‌లకు డబ్బులు చెల్లించకపోవటంతో లాయర్ నోటీసులను పంపించారు. వీటిని మెప్మా సీఎంఎం ద్వారా గ్రూప్‌ల వారికి అందజేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి సీఎంఎం ఎన్.సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. తాజాగా జ్యోతి మహిళా పొదుపు సంఘం సభ్యురాలుగా ఉన్న ఎస్.మేరీప్రసన్న కుమారికి అప్పట్లో బ్యాంక్ రుణం రూ. 30 వేలు మంజూరు చేశారు.మంజూరు చేసిన రుణంలో కేవలం రూ. 10 వేలు మాత్రమే ఆర్‌పి రజియా తనకు ఇచ్చిందనీ, తిరిగి మొత్తం బ్యాంక్‌కు చెల్లించినట్లు ఆమె తెలియజేసింది. ప్రస్తుతం బ్యాంక్ లావాదేవీలు చూస్తే తాను ఇంకా లక్షా 90 వేలు రూపాయిలు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. దీంతో లబోదిబోమంటూ ఆ యువతి మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి ఫిర్యాదు చేసింది. కమిషనర్ దీనిపై విచారించాలని మెప్మా సీఎంఎం ఎన్.సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. విచారించిన సీఎంఎం సదరు గ్రూపునకు ఇంకా రూ. 19 లక్షలు బకాయి ఉన్నట్లు తేల్చారు. దివ్యాంగురాలైన మేరీప్రసన్నకుమారి తనకు న్యాయం చేయాలని శనివారం మెప్మా కార్యాలయంలో బోరున విలపించింది. ఈ విషయమై సీఎంఎంను వివరణ కోరగా ఇలాంటి అక్రమాలు అనేకం జరిగినట్లు తెలిసిందనీ, వీటన్నిటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని చెప్పారు.

కమిటీ సభ్యులను మార్చాలి

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కొద్ది రోజులుగా లా విభాగంలో జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు శుక్రవారం అధికారులు నియమించిన కమిటీలో మార్పు చేయాలని దళిత విద్యార్థి సంఘం నాయకులు శనివారం రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంను కలిసి వినతిపత్రం అందజేశారు. లా విభాగంలో పనిచేస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ ఎల్. జయశ్రీని తక్షణమే విధుల నుంచి తొలగించాలని పేర్కొన్నారు. కమిటీలో సభ్యులుగా ఉన్న రంగయ్యను కూడా మార్చాలని, ఎటువంటి సంబంధం లేని డీన్ సుధాకర్‌ను కూడా మార్చివేయాలని కోరారు. కమిటీలో తప్పనిసరిగా షెడ్యూల్ కులాలకు చెందిన ప్రొఫెసర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఎస్డీఎస్ఎఫ్, డీఎస్‌పి, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ నియమితులయ్యారు. శనివారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు నియామక ఉత్తర్వులను పాల్ కుమార్‌కు అందజేశారు. పాల్ కుమార్ ప్రస్తుతం వ్యాయామ విద్య డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నా భర్త ఆచూకీ తెలియజేయండి

● పల్నాడు జిల్లా ఎస్పీని ఆశ్రయించిన భార్య



ఎస్పీ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతున్న మాధవి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం ఎస్‌బీఐలో గతంలో గోల్డ్ అప్రైజర్‌గా పని చేస్తున్న తన భర్త చేపూరి పూర్ణచంద్రరరావు గత కొద్ది రోజుల నుంచి కన్పించటం లేదని, ఆయన ఆచూకీ తెలియ జేయాలని పూర్ణచంద్రరరావు భార్య మాధవి, ఆమె బంధువులు శనివారం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాధవి మాట్లాడుతూ.. 'గతంలో దాచేపల్లి పీఎస్‌లో, ప్రస్తుతం గురజాల డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు వద్ద పూర్ణచంద్రరరావు రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. వడ్డీ రూపంలో రూ.లక్ష చెల్లించాడు. మిగిలిన డబ్బులు చెల్లించకపోవతో డబ్బులు చెల్లించాలని హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు పూర్ణచంద్రరావుపై ఒత్తిడి తెచ్చాడు. అనంతరం జనవరి 25న పూర్ణచంద్రరరావును, తన మామను దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో ఉంచి ఇబ్బంది పెట్టారని మాధవి తెలిపింది. అనంతరమే పూర్ణచంద్రరావు, తన మామ ఇద్దరూ కనపడకుండా పోయారని, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావే వారిని తీసుకు వెళ్లుంటాడాడని ఆరోపించింది. ఈ విషయంపై వెంటనే విచారణ చేపట్టాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం విడుదల

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై ఉమ్మడి గుంటూరు జిల్లాలో చనిపోయిన నలుగురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. ఫిరంగిపురం మండలం సిరింగిపాలెంకు చెందిన పెరికల జ్యోతి, మంగళగిరి మండలంలోని ఆత్మకూరుకు చెందిన రావూరి రాణి, అమరావతి మండలంలోని ధరణికోటకు చెందిన బలుసుపాటి వినయ్, దాచేపల్లి మండలంలోని తంగెడకు చెందిన దారం మణికంఠ పిడుగుపాటుతో చనిపోయారు. వీరి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాని శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

మహాశివరాత్రికి 163 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మహాశివరాత్రి పురస్కరించుకొని ఆర్టీసీ 163 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుంది. ఈ నెల 25న సాయంత్రం నుంచే ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్ రవికాంత్ తెలిపారు. మహాశివరాత్రికి శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు ఎటువంటి సమస్యల్లేకుండా ఆర్టీసీ పరంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విభజిత జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి మొత్తం 163 సర్వీసులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గుంటూరు నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లే భక్తుల కోసం గుంటూరు-1, 2 డిపోలతోపాటు మిగతా మూడు డిపోల నుంచి నరసరావుపేట వరకు 88 బస్సులను ఆపరేట్ చేయనున్నారు. ప్రతి పది నిమిషాలకో బస్సు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇక శ్రీశైలం, అమరావతి, క్వారీ, గోవాడ వంటి మిగతా శైవక్షేత్రాల కోసం అదనంగా 75 బస్సులను సిద్ధం చేస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైతే అదనపు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని డీపీటీవో పేర్కొన్నారు.

వృద్ధురాలి హత్యకేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పెదనందిపాడుకు చెందిన వృద్ధురాలిపై అత్యాచార, హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రేకులు షెడ్డులో నివాసం ఉంటున్న యార్ల రమణమ్మ(64)పై ఈ నెల 2వ తేదీ వేకువజామున అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తులు పాలపర్తి మంజు, పాలపర్తి సాంబ సోదరులు అత్యాచారం చేసి హతమర్చారు. అదే రోజు రమణమ్మ కూతురు వీరమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేశారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలు నేరస్తుల వేలిముద్రలు సరిపోవడంతో వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి పెదనందిపాడులో సంచరిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు గతంలో ఒక అత్యాచార కేసులో జైలుకు వెళ్లి వచ్చారనీ, సాంబ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రమణమ్మ హత్య కూడా తామే చేసినట్లు విచారణలో అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మధుపవన్, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుదాఘాతానికి రైతు మృతి

కొల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి ఓ రైతు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చినపులివర్రు గ్రామానికి చెందిన మాతంగి వరరాజబాబు (59) మొక్కజొన్న పంటకు నీరు అందిస్తున్నాడు. ఉదయం నుంచి పొలం పనుల్లో నిమగ్నమైన రైతు దాహం వేయడంతో మోటారు వద్దకు వెళ్లి నీరు తాగే క్రమంలో పైపునకు విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడేందుకు వాహనంలో వైద్యశాలకు తీసుకు వెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచి సమాచారాన్ని విద్యుత్ శాఖ ఏఈ సుధాకరబాబు, ఎస్ఐ ఏడుకొండలుకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపుతామని ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

దుగ్గిరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం గ్రామంలో 1100 గ్రాముల గంజాయిని దుగ్గిరాల పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల గంజాయి వ్యసనం బారిన పడిన యువకులు కొందరు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారంతో ఎస్సై ఎస్. వెంకటరవి నిఘా వేసి పట్టుకున్నారు. నలుగురు విక్రేతలతో పాటు ఇద్దరు వినియోగదారులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా గంజాయి విక్రేతల్లో ఒకరు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చిలువూరు, రేవేంద్రపాడు పరిసరాలు గంజాయికి అడ్డాగా మారిన విషయం విదితమే.

వేటపాలెం ఎడ్లకు ప్రథమ స్థానం



పోటీల్లో వేటపాలెం ఎడ్లు

మాచవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల పోటీల ప్రదర్శనలు ఆదివారంతో ముగిశాయి. సేద్యం విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివ కృష్ణ చౌదరి ఎడ్లు 3770.9 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజశ్వనీరెడ్డి ఎడ్లు 3250 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన సంపటం వీర బ్రహ్మనాయుడు ఎడ్లు 3149.7 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో, ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం ఉప మాగులూరు గ్రామానికి చెందిన కనుబుద్ది రవి శంకర్‌రెడ్డి ఎడ్లు 2798.6 అడుగుల దూరాన్ని లాగి నాలుగో స్థానంలో, పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన ముక్కపాటి హనుమంతరావు చౌదరి ఎడ్లు 2792 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మర్రివేముల గ్రామానికి చెందిన సిద్ది మల్లేశ్వరి ఎడ్లు 2567.3 అడుగుల దూరాన్ని ఆరో స్థానంలో, పల్నాడు జిల్లా గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామానికి చెందిన రాయంకుల రామారావు చౌదరి ఎడ్లు 1505 అడుగుల దూరాన్ని లాగి ఏడో స్థానంలో నిలిచాయి. వీరికి నగదు బహుమతులతో పాటు షీల్డ్ బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గూడా శ్రీనివాసరావు, తంగెడ హసన్‌లు వ్యవహరించారు.

జీవితంలో కృత్రిమ మేధస్సు అంతర్భాగమే



అధ్యాపకులను సత్కరిస్తున్న వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి కంచర్ల గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమకాలీన సమాజంలో కీలకమైన భాగంగా కృత్రిమ మేధస్సు ఉద్భవించిందనీ, విభిన్న కోణాలలో తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. కృత్రిమ మేధపై గత రెండు రోజులుగా వర్సిటీలో జరుగుతున్న జాతీయ స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ విస్తృత ప్రభావం, ఆరోగ్య సంరక్షణ, విద్య, వినోదంపై విస్తరించి ఉందన్నారు. హైదరాబాదులోని వర్ధన్ డేటా సైన్స్ అధ్యక్షుడు ఎస్.వి. రమణమూర్తి మాట్లాడుతూ రాబోయే రోజులలో మనిషి జీవన విధానాన్ని సులభతరం చేయబోతుందనీ, అనేక రంగాలలో సమర్థతను పెంచుతుందని తెలిపారు. సదస్సులో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమ, డాక్టర్ యూ. సూర్య కామేశ్వరి, డాక్టర్ ఆర్ వసంత, పుష్పలత, డాక్టర్ బసవేశ్వరరావు పాల్గొన్నారు. పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వస్తువు నాణ్యతతో నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎఎన్‌యూ వాణిజ్య విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న వ్యాపార విశ్లేషణ- మేధస్సు పురోగతి అనే రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి మాట్లాడుతూ వస్తు ఉత్పత్తిపై అవగాహన ఉండాలని, వస్తువు నాణ్యత పాటించినట్లయితే వినియోగదారుడు దానిపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటారని పేర్కొన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, విభాగాధిపతి, జాతీయ సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేష్ విశ్వనాథన్, అధ్యాపకులు వై.శ్రీనివాసులు, సంయుక్త ఇన్ఫో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బుచ్చిబాబు, తదితరులు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎన్.రత్న కిషోర్, డాక్టర్ ఎ.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బాపట్ల కలెక్టరేట్‌లో ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయటం జరిగిందని నోడల్ ఆఫీసర్ తెలిపారు. ఎవరైతే సిబ్బంది ఎన్నికల విధులకు హాజరవుతారో వారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుటకు ఫారం-12ను పూర్తి చేసి ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గుంటూరు జిల్లా కలెక్టరేట్ వారికి పోస్ట్‌ద్వారా పంపవలెనన్నారు. లెనియెడల వారి అప్లికేషన్‌ను బాపట్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో ఈనెల 19వ తేదీలోపు ఫారం-12 వివరాలు అందజేయాలని తెలిపారు. వీటిన్నిటిని ఫెసిల్లిటేట్ చేసి గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి వారికి సమర్పించటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎలక్షన్‌లకు సంబంధించి విధులు కేటాయించిన సిబ్బంది ఎవరైన సరే ఈ హెల్ప్ డెస్క్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు.

జిల్లా ఇండస్ట్రీయల్ ప్రమోషన్ ఆఫీసర్ సస్పెండ్

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విధులు పట్ల నిర్లక్ష్యంగా వహించినందుకు జిల్లా ఇండస్ట్రీయల్ ప్రమోషన్ ఆఫీసర్ వివి సురేంద్రను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జరుగుతున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల సర్వేపై అధికారులను తప్పుదోవ పట్టించినందుకు ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు పరిశీలించిన డీఈవో

బాపట్లరూరల్,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నూతన క్లస్టర్ సమావేశాన్ని బాపట్ల విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం శనివారం సందర్శించి ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణతరగతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న 3,4,5 తరగతుల ఉపాధ్యాయులకు, 1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు వేర్వేరుగా శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు టెక్నికల్ నాలెడ్జ్‌ని కూడా పెంచుకోవాలని డీఈవో కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కెబి పాలెం ప్రధానోపాధ్యాయులు కె.రామారావు పాల్గొన్నారు.

గాలిబ్ విశ్వ విఖ్యాత కవి

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గాలిబ్ ఉర్దూ కవి సామ్రాట్‌యేగాక విశ్వ విఖ్యాత కవి అని, ఉర్దూ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తంగా ప్రజ్వలింప చేసిన కవులలో గాలిబ్ ప్రముఖులని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. గాలిబ్ 156వ వర్ధంతి కార్యక్రమంలో శనివారం సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, డాక్టర్ శ్రీనివాస్ సంయుక్తంగా మాట్లాడుతూ గాలిబ్ పారసీ భాషలో 11000లకు పైగా, ఉర్దూ భాషలో 1700లకు పైగా కవితలు రచించి విశ్వ సాహితీ జగత్తులో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం రచయితలు డి.శామ్యూల్, ప్రముఖ నటులు మస్తాన్ రెడ్డి, కామరాజు కాళీదాసు, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు గాలిబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పేరలి గ్రామం మేకలవారిపాలెంకు చెందిన మేకల అంకారావు మృతి చెందారు. శనివారం పేరలి నరసయ్య, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్‌చైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, గేరా ఏసుబాబు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాగిత విజయరాజు, మద్దిబోయన బుల్లియ్య, జోగి సురేష్, దాసరి రత్నరాజు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలి

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల పరిరక్షణకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు అన్నారు. భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని దేవాదాయ అధికారులు, ధర్మకర్తలు, ట్రస్టీలు, గ్రామ పెద్దలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆలయాల్లో చోరీల నివారణతో పాటు ఇతర భద్రతా కారణాలు దృష్ట్యా చిన్న, పెద్ద ఆలయాల్లో నిఘా కోసం సీసీ కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) :భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని పెదపులివర్రు శివారు గుత్తావారిపాలెం కల్యాణ మండపంలో టీడీపీ నాయకుడు జంపని వీరయ్య ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి గానామృత కల్యాణ మహోత్సవం జరిగింది. పూజాది కార్యక్రమాల్లో దాసరి వెంకటశివనాగరాజు, చాట్రగడ్డ క్రాంతి దంపతులు నిర్వహించారు. కళ్యాణ పూజను చీరాలకు చెందిన గానామృత జగన్నాథ కల్యాణ సమితి వారు జరిపించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

నగరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : శ్రీగిరిపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నగరం మండల అభివృద్ధి అధికారి బొర్రా శ్రీనివాసరావు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వయంభువుగా వెలసిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎంపీడీవోని ఘనంగా సత్కరించారు.

ఆహ్లాద వాతావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కలెక్టర్ జె.వెంకటమురళి



బాపట్లలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, అధికారులు



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో, మున్సిపల్ అధికారులు

బాపట్ల,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రేపటి తరం కోసం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ప్రజలకు పిలుపునిచ్చారు. బాపట్ల పట్టణం 32వవార్డు చెంగల్రాయుడుతోటలో శనివారం స్వచ్ఛంద్ర.. స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాలు, పల్లెలు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలలో, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లలో శుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండేవిధంగా ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. చెత్త నుంచి సేకరించిన ఎరువు ద్వారా పూలమొక్కలు, పండ్లతోటలను సాగు చేస్తున్న పుష్ప అనే మహిళ గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

● బాపట్ల కొత్తబస్టాండ్‌లో ప్రభుత్వ పిలుపు మేరకు డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం ద్వారా బస్టాండ్ పరిసరాలు శుభ్రం చేయించారు. అనంతరం ఆర్టీసి గ్యారేజి ఇన్‌చార్జి రామకృష్ణ, ట్రాఫిక్ అండ్ గ్యారేజి సిబ్బందితో కలిసి గ్యారేజిలో మొక్కలను నాటారు. అనంతరం సిబ్బందితో డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ స్వచ్ఛంద్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి వి.నాగేశ్వరరావు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని డీపీవో కేవీఎల్ ప్రభాకరరావు అన్నారు. అడవి పంచాయతీలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛంద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ముందుగా పారిశుధ్య కార్మికులకు నూతన యూనిఫారం, రక్షణ కిట్‌లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం బాపట్ల ఎంపీడీవో బి.బాబురావుతో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం అధికారులు, పారిశుధ్య కార్మికులతో స్వచ్ఛంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ శశికిరణ్, పంచాయతీ కార్యదర్శి విజయసారధి, బాబురావు పాల్గొన్నారు.

● గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు అన్నారు. గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు నూతన యూనిఫారం, రక్షణ కిట్‌లను శనివారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో గ్రామసచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో కలిసి డీపీవో ప్రభాకరరావు, పలుశాఖల అధికారులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, కార్యదర్శి వీరాస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు తెలిపారు. చందోలు గ్రామ పంచాయతీ-1, 2 సచివాలయ పరిధిలోని అన్ని వార్డులలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర గురించి ఉద్యోగస్తులతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించి మానహారంగా ఏర్పడి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, కార్యాలయ సూపరింటెండెంట్ బి.మధుసూదనరెడ్డి, చందోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.సుజాత, సచివాలయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



వేమూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రత్యేక అధికారి విలియం, ఎంపీడీవో శివన్నారాయణ తదితరులు

● వేమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వేమూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక అధికారి విలి యం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీడీవో శివన్నారాయణ, తహసీల్దార్ సుశీల, పంచాయతీ కార్యదర్శి భూపతిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

● కొల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆలయ సిబ్బంది స్వచ్ఛత సేవ కార్యక్రమం నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని పోతార్లంక గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం పరిసరాలలో ఉన్న పిచ్చి చెట్లు, వ్యర్థాలను కార్య నిర్వహణాధికారి దీవి వెంకట పులాచార్యులు ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు పరిశుభ్రపరిచారు. ఆలయానికి వచ్చే భక్తులు పరిశుభ్ర వాతావరణంలో స్వామి వారిని దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఈవో పేర్కొన్నారు.

● రేపల్లె, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యవంతులు కావాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. పట్టణంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. సొసైటీ పరిసరాలను శుభ్రం చేసి పరిశుభ్ర రేపల్లెగా సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని ప్రతిజ్ఞ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతలా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన వాతావరణంలో నివాసం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

● రేపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎక్సైజ్ సీఐ ఆర్.దివాకర్ తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

● స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీసీ రవిచంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.బాలగురవయ్య, డాక్టర్ ఎం.నరసయ్య, ప్రసన్నకుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

● నగరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివాస్ కార్యక్రమం శనివారం నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు బొర్రా శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, స్థానిక కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మున్నంవారిపాలెంలో ఏఎస్పీ పల్లె నిద్ర



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు వారి పరిధిలోని గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్లలోని మున్నంవారిపాలెంలో అడిషనల్ ఎస్పీ పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలు గురించి అవగాహన కల్పించి ఆ ప్రాంతంలో నివాసం ఉండే చెడునడత కలిగిన వ్యక్తుల సమాచారాన్ని ప్రజలు నుంచి సేకరించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిని చట్టపరిధిలో పరిష్కరించటానికి కృషి చేస్తామని తెలిపారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకొచ్చే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవటం జరుగుతుందన్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పట్టభద్రులకు అగ్రి క్లినిక్స్ ఆశాకిరణం

● జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

బాపట్ల,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ సమస్యతో బాధపడుతున్న వ్యవసాయ పట్టభద్రులకు అగ్రి క్లినిక్స్ అండ్ అగ్రి బిజినెస్ సెంటర్ పథకం ఆశా కిరణం వంటిదని, తమ కాళ్ళపై తాము నిలబడేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో శనివారం నిర్వహించిన నాబార్డు వర్క్‌షాపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ పథకం ద్వారా ప్రతి నిరుద్యోగ వ్యవసాయ పట్టభద్రుడికి వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత వ్యాపారం, పరిశ్రమల స్థాపనకై 20 లక్షల వరకు బ్యాంక్‌ల ద్వారా వ్యక్తిగత లోను ఇవ్వబడుతుందని, సమష్టిగా నిర్వహించదల్చుకున్న సమూహానికి కోటి రూపాయల వరకు లోను మంజూరు చేయబడుతుందన్నారు. వ్యవసాయ సంబంధిత ప్రాజెక్ట్‌లను రూపొందించుకొని ఈ రుణసదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్ఆర్ కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి రవికుమార్, లీడ్ జిల్లా మేనేజర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

● సమగ్రశిక్ష బాపట్ల సహిత విద్యావిభాగం కోఆర్డినేటర్ ఎం.జోత్స్న

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్క విద్యార్థి అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష బాపట్ల సహిత విద్యావిభాగం కోఆర్డినేటర్ ఎం.జోత్స్న అన్నారు. బాపట్ల మండలం అప్పికట్ల ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన క్లస్టర్ సమావేశానికి పరిశీలకులుగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ వెనుక బెంచీ విద్యార్థులకు కూడా పూర్తి స్థాయి అక్షరజ్ఞానం అందివ్వాలని అన్నారు. టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకులు, క్లస్టర్ మరో పరిశీలకులు సీహెచ్ అబ్రహం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జరిగే క్లస్టర్ సమావేశాలలో ప్రతి ఉపాధ్యాయుడు వినూత్న అవగాహన, పరస్పర సెర్చ్‌ల ద్వారా విద్యాబోధనలో వినూత్న వివరాలు వివరించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అప్పికట్ల క్లస్టర్ చైర్మన్ యు.వి.సుధారాణి, క్లస్టర్ కార్యదర్శి ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందించాలి

కర్లపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు మెరుగైన విద్యనందించడం, మెరుగైన పౌష్టికాహారం అంగన్‌వాడీ కార్యకర్తలు అందించాలని పీహెచ్‌సీ కర్లపాలెం డాక్టర్ గోపినాథ్ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషణ బీ, పడాయి బీ' మీద మూడురోజుల అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ పిల్లల పౌష్టికాహారంపై దృష్టిసారించాలని, న్యూట్రీషన్ ఫుడ్ ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాగమల్లేశ్వరి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రం ఏర్పాటు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని డంపింగ్ యార్డులో శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి వెంకటశివకుమార్ ఆధ్వర్యంలో వానపాములను వర్మీ కంపోస్ట్ ఎరువులో కలిపి తొట్టెలలో వేశారు. వీటి ద్వారా వర్మీ కంపోస్ట్‌లు తయారు చేసుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది మెండు ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వేను పూర్తి చేయాలి

బాపట్ల,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వేను మూడురోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సూక్ష్మ, మధ్యతరగతి పరిశ్రమల సర్వేను పూర్తి చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల సర్వేను డ్రై మోడ్‌లో చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా పరిశ్రమలశాఖాధికారి బి.శ్రీనివాసరావు, గ్రామ,వార్డు సచివాలయాల ఇన్‌చార్జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

కుందేరు వాగు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి

కుందేరువాగు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కుందేరువాగు ఆక్రమణలు తొలిగించటానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, డ్రైనేజి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుందేరువాగు వెడల్పు చేయటానికి రెండువైపుల కాల్వలు నిర్మించటానికి అవసరమైన డీపీఆర్ ప్రతిపాదనను తయారు చేయాలని డ్రైనేజి శాఖ ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల ఆర్డీవో గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, డ్రైనేజి శాఖ ఇంజనీర్ సుబ్బారావు, బాపట్ల, చీరాల తహసీల్దార్‌లు సలీమా, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

అమృతలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో పని చేయాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై శనివారం ఆలయ ప్రాంగణంలో ద్వితీయ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆర్డీవో హాజరై ఆయా శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున స్వామి వారిని సుమారు రెండు లక్షల మంది దర్శనం చేసుకుంటారన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, అదనపు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు పంచాయతీ సర్పంచ్ మండవ విజయలక్ష్మి తెలిపారు. వైద్యాధికారి ఏసుబాబు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో, వెలుపల రెండు మెడికల్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ శాఖ ఏఈ నాంచారయ్య మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ సమావేశంలో పండగ ప్రత్యేక అధికారి అనుపమ, డీఎల్‌పీవో శ్రీనివాసన్, ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, సర్పంచ్ మండవ విజయలక్ష్మి, తహసీల్దార్ నెహ్రూబాబు ఎంపీడీవో మారుతీ శేషమాంబ, చుండూరు సిఐ సీహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు, ఎస్ఐ అమర్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మోదుకూరు పాఠశాలకు కంప్యూటర్లు బహుకరణ

చుండూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మోదుకూరులోని శ్రీ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, గుంటూరు నివాసి ఎఫెక్స్ నాగేశ్వరరావు ఐదు కంప్యూటర్లు శనివారం బహుకరించారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కంచర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ బీ పడాయి బీ శిక్షణ

వేమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన పోషణ్ బీ పడాయి బీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. సీడీపీవో విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటసురేష్ బాబు మాట్లాడుతూ, ఆరు సంవత్సరాల పిల్లల పోషణ, విద్య ప్రాముఖ్యత సామూహిక చర్యలు, కార్యకలాపాలు, ఐదు అభివృద్ధి మైలురాళ్ల గురించి వివరించారు. సూపర్‌వైజర్లు అమృతవాణి, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తి అరెస్టు

వేమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జంపని గ్రామానికి చెందిన తటుకూరి భాగ్యలక్ష్మిపై గురువారం అదే గ్రామానికి చెందిన ప్రభాకరరావు ఉలితో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వేమూరు పోలీసులు శనివారం నిందితుడు ప్రభాకరరావును అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

ఆలపాటి గెలుపునకు ఉపాధ్యాయులు ప్రధాన భూమిక వహించాలి

● ఎమ్మెల్యే ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం ఉపాధ్యాయులు ప్రధాన భూమిక వహించాలని ఎమ్మెల్యే ఆనందబాబు కోరారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా శనివారం వేమూరులో ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలతో పాటు విద్యా వ్యవస్థకు కూడా పూర్తిగా దిగజార్చిందని ఆవేదన వ్యక్తపరిచారు. విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు మంత్రి లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సముచితమైన ఆలోచనలతో అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబడే విధంగా పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ, ఆలపాటి అందరి మనిషి అని, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవే పరమావధిగా తన వంతు సేవలందిస్తున్నారన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎన్నికలు అనంతరం వాటిపై మంత్రితో చర్చించి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

ఆలపాటి విజయానికి కూటమి శ్రేణులు కృషి చేయాలి : మైనేని



ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని

కొల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో కొల్లూరు జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల, దోనేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. మైనేని మాట్లాడుతూ, శాసన సభ్యునిగా, మంత్రిగా ఉన్నత పదవులు నిర్వహించి ప్రజలకు ఎనలేని సేవ చేసిన వ్యక్తి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బూత్ ఇన్‌చార్జిలు కొమ్ము తులామాను, యడ్ల శ్రీనివాస్, గాదె చంటి, గూడూరు దామోదర్, టీడీపీ నాయకులు పెదపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలపాటి విజయం కోసం ప్రచారం

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు వెదుళ్ళపల్లి హైస్కూల్‌లోని ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందజేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుడిపల్లి సాంబశివరావు, వెదుళ్ళపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు కుంచాల సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బండారు వెంకటేశ్వర్లు, కావూరి కిషోర్‌రెడ్డి, చాంద్‌బాషా, వెంకయ్య, కిరణ్, సింగారెడ్డి, నాయుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపత్త్యాంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు అగ్రిమెంట్



పనుల అగ్రిమెంట్‌ను కాంట్రాక్టర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో ఉన్న శ్రీ సువర్చల సమేత ప్రపత్త్యాంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులలో భాగంగా గర్భాలయ నిర్మాణానికి ప్రముఖ దేవాలయాలు నిర్మాణం చేసిన నటరాజన్ గణేశన్‌కు వర్క్ అగ్రిమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేతుల మీదగా అందజేశారు. అలాగే అడ్వాన్స్‌గా 12 లక్షల 116 రూపాయల నగదును కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కావూరి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అవయవదానంతో మృత్యువును జయించవచ్చు

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

బాపట్ల,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అవయవదానం ద్వారా మృత్యువును జయించవచ్చు అని ప్రకృతి సూత్రాన్ని అందిపుచ్చుకొని మానవులు అవయవదానం చేసి మరణించిన తర్వాత కూడా జీవించాలని అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు ప్రభుత్వ వైద్యశాల (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అన్నారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో రైస్‌మిల్లు అసోసియేషన్ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా డాక్టర్ వైఎస్ కృష్ణమూర్తి స్మారక ఉపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ అవయవదానం మన సామాజిక బాధ్యత అని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డబ్ల్యుజికె మూర్తి మాట్లాడుతూ డాక్టర్ కృష్ణమూర్తి వైద్య, విద్యారంగాలలో బాపట్లకు విశేషమైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్దార్థ, గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవాకుమార్, పీఎస్‌కే విద్యాసంస్థల చైర్మన్ పేరలి సునీల్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ సభలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీహరిరావు, విశ్రాంత అధ్యాపకులు గోరంట్ల శాంతారాం, జేవీ సుబ్రహ్మణ్యం, గురజాల శ్రీనివాసరావు, చిత్రకారుడు జీవీ, ప్రసన్నాంజనేయులు, వాసుదేవరావు, ఇక్కుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : సత్వర కేసుల పరిష్కారం కోసం మార్చి 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించటం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. కోర్టు ప్రాంగణంలో బ్యాంకు అధికారులకు, బీఎస్ఎన్ఎల్, రెవెన్యూ తదితర అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు బీఎస్‌వీ శర్మ, కె.నాగాంజనేయులు, కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ వెంకటేశ్వరరావు, బీఎస్ఎన్ఎల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

రేపల్లె, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ పిల్లల కోసం వారి హక్కులను కాపాడే విధంగా వివిధ అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇవ్వటం జరిగిందని సీడీపీవో సుచిత్ర అన్నారు. శనివారం స్థానిక సీడీపీవో కార్యాలయంలో పోషన్‌బి, పడాయిబి అంగన్వాడీ, కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముగిసిన మూడు రోజుల శిక్షణ

కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరులో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏసీడీపీవో విజయరాణి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు ప్రచారం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి ఎమ్డీవో ఆఫీసు వద్ద వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర గ్రామసచివాలయ సిబ్బందితో శనివారం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, ఎంఈవో ఎ.మహేష్‌బాబు ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

❖ మిర్చియార్డులో ఎవరి వాదన వారిది
❖ మిర్చి ధర పెంచడం లేదని రైతుల ఆరోపణ
❖ మిర్చి నాణ్యత బాగోకపోవడం వలనేనంటున్న వ్యాపారులు
❖ నిస్సహాయ స్థితిలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

ధరపై.. దిగాలు



గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో 30 శాతం కూడా వ్యాపారం జరగని తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి ధర రోజు రోజుకూ పెరుగుతున్నది. మరోవైపు పేరుకు ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చియార్డుగా పేరుగాంచిన గుంటూరు ఏఎంసీలో మాత్రం ధర పెరగడం లేదు. కొనుగోళ్లు జరుగుతున్నా రైతులు ఆశించిన ధర రాకపోతుండటంతో దిగాలు చెందుతున్నారు. ఇందుకు ఇటు రైతులు, అటు వ్యాపారులు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నారు. తాము తీసుకొచ్చిన మిర్చికి నాణ్యత లేదని, కాయ సైజు తక్కువగా ఉందని, తేమ శాతం అధికంగా ఉందని చెప్పి వ్యాపారులు రేటు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా రైతులు తీసుకొస్తున్న మిర్చి రంగు బాగుండాలని కొంతమంది నీళ్ల స్ప్రే చేయడం, బాగా ఎండకుండానే మెతకగా ఉన్న తరుణంలోనే తీసుకొస్తుండటం వలన ఎక్స్‌పోర్టర్లు ధర పెంచడానికి ఆసక్తి చూపడం లేదని కమీషన్ వ్యాపారులు చెబుతున్నారు. ఖమ్మం మార్కెట్‌లోకి వస్తున్న మిర్చి క్వాలిటీగా ఉంటుండటంతో అక్కడ క్వింటాల్‌కు రూ. 500 నుంచి రూ. 1000 వరకు అధిక ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

గుంటూరు మిర్చియార్డులో సీజన్ మొదలై ఇప్పటికే నెలన్నర దాటిపోయింది. అయినప్పటికీ క్వింటాల్ మిర్చి రూ. 13 వేల నుంచి రూ. 13,500 వద్దనే కొనసాగుతున్నది. మరోవైపు ఖమ్మం మార్కెట్ యార్డులో గత వారం తేజ క్వాలిటీ మిర్చి క్వింటాల్ రూ. 14,500కు చేరింది. అక్కడ ఇంకా ధర పెరిగేందుకు ఆస్కారం ఉందని ఇక్కడి ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అక్కడికి వస్తున్న మిర్చి క్వాలిటీతో పాటు హమాలీ, లారీ కిరాయి ఛార్జీలు తక్కువగా ఉండటం కూడా వ్యాపారస్తులు ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయడానికి ఒక కారణంగా ఉన్నది. మరోవైపు గుంటూరు మిర్చియార్డులో సిండికేట్లదే రాజ్యం. యార్డులో రైతు అడుగు పెట్టినప్పటి నుంచి పీక్కు తినేందుకు ప్రయత్నిస్తుంటారు. ఎన్ని ఆదేశాలు ఇస్తున్నా లాట్ల నుంచి మచ్చుకాయలు తీయడం ఆపడం లేదు. కమీషన్ వ్యాపారుల దుకాణాల వద్దనే ఈ తతంగం జరుగుతున్నది. ముఠావర్కర్లు ఒకపక్క హమాలీ ఛార్జీలు తీసుకొంటూనే మరోవైపు కేజీలకు కేజీల మిరపకాయలను తీసుకొంటుండటం వలన రైతుకు ప్రత్యక్షంగానే నష్టం జరుగుతున్నది.

రైతులు... ఇలా చేయండి

మిర్చియార్డుకు రైతులు తమ మిరపకాయలను తీసుకొచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. సైజుల వారీగా ముందుగానే గ్రేడింగ్ చేసుకొంటే మంచిది. కాయ మెతకగా ఉన్నప్పుడు తీసుకురావొద్దు. కల్లాల్లో బాగా ఎండబెట్టి తీసుకురావాలి. ఎట్టిపరిస్థితుల్లో తూకం పెరగాలని మిర్చి టిక్కీలకు నీళ్లు వెదజల్లొద్దు. రంగు, సైజు, బాగా ఎండి ఉంటే కచ్చితంగా వ్యాపారుల నుంచి పోటీ ఉంటుంది. అప్పుడు రైతు తనకు ఇష్టమైన ధరకు అమ్ముకోవచ్చు. ప్రస్తుతం కొనుగోళ్లు బాగా జరుగుతున్నందున కొంచెం క్వాలిటీ మిరపకాయలు తీసుకొస్తే ధర క్వింటాల్ రూ. 15 వేలు దాటడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. క్వాలిటీ తీసుకొచ్చినా ధర పెంచకపోతే అప్పుడు వ్యాపారులను నిలదీయొచ్చు. మార్కెట్ కమిటీకి కూడా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.


రైతులు తీసుకొచ్చిన మిర్చిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో యార్డులోనే ఎండబెడుతున్న వ్యాపారులు

నాణ్యతకు కొలమానం ఎలా?


గతంలో మిర్చియార్డులో ఒక లేబొరేటరీ ఉండేది. అక్కడ రైతులు ఎవరైనా మిర్చిని తీసుకొస్తే రంగు, సైజు వంటివి పరీక్షించి సర్టిఫికేట్ ఇచ్చేవారు. దాంతో వ్యాపారులు ఆ సర్టిఫికేట్ ఆధారంగా ధర అధికంగా చెల్లించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఏ కోశాన కనిపించడం లేదు. అసలు రైతులు తీసుకొస్తున్న నాణ్యతని కొలమానం చేసే వారెవరూ లేరు. దాంతో వ్యాపారులు చెప్పిన మాటే వినాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గ్రిడ్ అనుసంధానంపై.. అధ్యయనం

(5వ పేజీ తరువాయి)

కానున్నారు. వాటర్ గ్రిడ్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. పల్లెల కోసం వాటర్ గ్రిడ్ చేపట్టగా దీనిని పట్టణాలకు అనుసంధానం చేస్తుండటంతో పథక వ్యయ అంచనాలను మళ్లీ రూపొందిస్తున్నారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందిస్తారు. సీఎం నారా చంద్రబాబు వాటర్ గ్రిడ్‌పై ఇంజనీర్లతో రానున్న వారంలో సమీక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆమోదించింది. కేంద్రం, రాష్ట్రప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం నిధులు సమకూర్చనున్నాయి. రూ.783.39 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. ఈ పనులు అమృత్ నిధులతో చేపడతారు. అయితే అమృత్ పనులను వాటర్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి అటు పల్లెల్లో, ఇటు మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా అధ్యయనానికి అధికారులను ఆదేశించింది. సాగర్ నుంచి ఏ ప్రాంతానికి ఎంత సామర్థ్యం కలిగిన పైపులైన్లు అవసరమో అధికారులు నిర్ధారిస్తారు.


సాగర్ నుంచి కుడి కాలువకు నీటి సరఫరా

నిలిచిన పనులకూ అంచనాలు

మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆయా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక పల్నాడు జిల్లాలోనూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకానికీ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేయలేదు. ఈ పథకాన్ని అటకెక్కించింది. ఈ పరిస్థితుల్లో అటు అమృత్, ఇటు వాటర్‌గ్రిడ్ పథకాల్లో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం వ్యయ అంచనాలను రూపొందించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా డీపీఆర్‌లను

అమృత్.. జలజీవన్ మిషన్ నిధులు అందుబాటులో..

వాటర్ గ్రిడ్‌కు అమృత్ 2.0 జలజీవన్ మిషన్ పథకం నుంచి నిధులు సమకూరనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలకు పెద్దపీట వేస్తోంది. జలజీవన్‌ను 2028 వరకు పొడిగించింది. మున్సిపాల్టీలకు అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. పట్టణాల్లో అమృత్ కింద రూ.783.39 కోట్లతో డీపీఆర్‌లు సిద్ధం చేశారు. ప్రతి మున్సిపాల్టీలో నీటి పథకాలను అభివృద్ధి చేయాల్సి ఉండగా వాటర్ గ్రిడ్ వల్ల వ్యయం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నిధులను వాటర్ గ్రిడ్‌కు మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాటర్ గ్రిడ్‌తో పట్టణాలు, పల్లెలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

గ్రూపు-2 పరీక్ష... పకడ్బందీగా నిర్వహించాలి

● జేసీ భార్గవ తేజ

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ వారు గ్రూప్-2 సర్వీసెస్(నోటిఫికేషన్ నం. 11/2023) ఉద్యోగాల నియామకానికి సంబంధించిన మెయిన్స్ పరీక్షని పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల కో-ఆర్డినేటింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అమలినేని భార్గవ తేజ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలితో కలిసి పరీక్షల లైజను ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష ఈ నెల 23వ తేదీ(ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు(పేపర్-1), మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు(పేపర్-2) పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలలో ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. మొత్తం 9,277 మంది అభ్యర్థులు హాజరు అవుతారని తెలిపారు. జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాలకు సీనియర్ జిల్లా అధికారులను లైజను ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. ప్రతి అధికారిని తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అక్కడ చీఫ్ సూపరింటెండెంట్, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహణ సజావుగా జరిపించేందుకు తీసుకొనవలసిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఈ నెల 21వ తేదీన మరోసారి ఏపీపీఎస్సీ అధికారులతో పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజను ఆఫీసర్లు, పోలీసు, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ తదితర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు.


కలెక్టరేట్‌లో గ్రూపు-2 పరీక్షల నిర్వహణపై లైజన్ అధికారులతో సమావేశమైన జేసీ భార్గవ తేజ

ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేయాలి

● పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ పార్వతి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్ని మరింత బలోపేతం చేసేలా ఉపాధ్యాయులు పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ పీ పార్వతి సూచించారు. శనివారం పాతబస్టాండు వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్లస్టర్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 64 క్లస్టర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు గ్రేడింగ్ ఇవ్వడంతోపాటు వారి నైపుణ్యాలను విశ్లేషిస్తామని వివరించారు. పాఠశాలల్లో సకాలంలో సిలబస్ పూర్తిచేయడం, కష్టమైన చాప్టర్స్ బోధన మరింత సమగ్రంగా వివరించడం, పాఠ్యప్రణాళిక, వినూత్నబోధనా పద్ధతుల్ని తీసుకుస్తామన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతోపాటు వారిలో నైపుణ్యాలు పెంపొందించేలా కృషి చేస్తామన్నారు. డీఈవో సీవీ రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేయాల్సిన సమష్టిబాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ నోడల్ ఆఫీసర్లు అబ్దుల్ ఖుద్దూస్, ఎండీ ఖాసిం, హెచ్ఎం వసుంధర తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ పార్వతి

హైకోర్టు ఏజీపీగా నంద నాగ రవిశంకర్ నియామకం



గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం వాసి ముప్పాళ్ళ నంద నాగ రవిశంకర్‌ను హైకోర్టు ఏజీపీగా నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది ముప్పాళ్ళ నంద నాగ రవిశంకర్‌ను ఏజీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఏజీపీ రవిశంకర్ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రవిశంకర్‌కు శుభాకాంక్షలు చెప్పారు.

ఎన్నికల డ్యూటీ ఉద్యోగులకు.. శివరాత్రి లేనట్లే

● 26న మహా శివరాత్రి పర్వదినం
● ఇదే రోజున డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పండగ ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుదినం అయినప్పటికీ ఆ రోజున కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల విధులు నిర్వహించాల్సిన సిబ్బందికి వర్కింగ్ డేనే. ఇందుకు కారణం శివరాత్రి పండగ మరుసటి రోజునే పోలింగ్ తేదీ కావడం. దీని దృష్ట్యా ముందురోజునే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు ఉదయాన్నే అధికారులు, సిబ్బంది చేరుకుని పోలింగ్ సామాగ్రిని తీసుకొని వారికి కేటాయించిన రూట్లలో బూత్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వేల మంది ఉద్యోగులకు పండగ సెలవుదినం ఈ సారి లేనట్లే. దీంతో వారంతా అసంతృప్తికి గురౌతున్నారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27వ తేదీన గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ జరగాల్సి ఉంది. ఈ కారణంగా ముందురోజు ఈ నెల 26వ తేదీ బుధవారం ఉదయం 8 గంటల కల్లా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు, బందోబస్తులో పాల్గొనే పోలీసు సిబ్బంది, నోడల్ అధికారులు గుంటూరు నగరంలోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు రావాలి. అక్కడ ఏర్పాటు చేసే కౌంటర్ల వద్ద పోలింగ్ సామాగ్రిని తీసుకుని బస్సుల్లో రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని అక్కడే బస చేయాలి. 26వ తేదీనే ఈ సంవత్సరం మహా శివరాత్రి పర్వదినం వచ్చింది. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం అంతగా పరిగణనలోకి తీసుకోలేదు. ఈ నేపథ్యంలో తమకు శివరాత్రి పండగ లేనట్లేనని డ్యూటీలు పడిన వారిలో చాలామంది అసంతృప్తికి లోనౌతున్నారు.

పోలింగ్ విధులకు గుంటూరులో 1867 మంది అధికారులు, సిబ్బంది

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 483 పోలింగ్ బూత్‌లున్నాయి. ఒక్క గుంటూరు జిల్లాలోనే 185మంది పీవోలు, 185 మంది ఏపీవోలు, 379 మంది ఓపీవోలు, 178 మంది మైక్రో అబ్జర్వర్లు, 26 మంది సెక్టోరల్, మరో 26 మంది రూట్ ఆఫీసర్లు ఉన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు 888 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. మొత్తంగా 1867 మంది గుంటూరు జిల్లాలో ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రం

● 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో చీపుర్లు పట్టిన అధికారులు
● చెత్తా, చెదారానికి మోక్షం

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణం మొత్తాన్ని స్వచ్ఛ ప్రదేశంగా మారుద్దామని ఉద్యోగులతో జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవ తేజ ప్రతిజ్ఞ చేయించారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఉద్యోగులతో కలిసి జేసీ శ్రమదానం నిర్వహించారు. కలెక్టరేట్‌లో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని ఎత్తి డంపర్‌బిన్‌లలో పోసి బయటకు తరలించారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నెలలో ప్రతి మూడో శనివారం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహణకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ఆ రోజు వరకు నిరీక్షించకుండా కలెక్టరేట్‌లో ఎక్కడ పడితే అక్కడ చెత్తని పడేయకుండా ఉద్యోగులు, సందర్శకులు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. డస్టుబిన్‌లలోనే చెత్తని వేయాలన్నారు. దీనివలన పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, మత్స్య శాఖ డీడీ గాలిదేముడు, డీపీవో సాయికుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ ఉప సంచాలకులు వందనం, కలెక్టరేట్ సెక్షన్ సూపరిండెంట్‌లు, అధికారులు పాల్గొన్నారు.


జెడ్పీలో చీపురుతో చెత్త పోగు చేస్తున్న సీఈవో జ్యోతి బసు తదితరులు


కలెక్టరేట్‌లో శ్రమదానం నిర్వహిస్తున్న జేసీ భార్గవ తేజ, డీఆర్వో ఖాజావలి

జడ్పీలో...

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర పుణ్యామా అని ప్రభుత్వ కార్యాలయాలు బాగుపడుతున్నాయి. ప్రతి నెల మూడో శనివారం రోజున అధికారులు చీపుర్లు పట్టుకోవటంతో కార్యాలయాల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారానికి మోక్షం కలుగుతుంది. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈవో వి.జ్యోతిబసు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. సీఈవోతోపాటు ఆయా సెక్షన్ల సూపరింటెండెంట్లు పారిశుధ్య పనుల్లో భాగస్వాము లయ్యారు. జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్ పాల్, సెక్షన్ల సూపరింటెండెంట్లు పూర్ణ చంద్రారెడ్డి, మల్లేశ్వరరావు, పీఆర్ యూనియన్ రాష్ట్ర నేత డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డివిజన్ ప్రత్తిపాడు కార్యాలయంలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డీఈ జె.భానుప్రకాష్, సీనియర్ అసిస్టెంట్‌లు ఎం. ప్రశాంతి, గుంటుపల్లి శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ ఏఎస్ చక్రవర్తి, జేటీవో పీఎస్వీఎస్ ఎస్.ప్రసాద్, పి.శారదా దేవి తదితరులు పాల్గొన్నారు.

పోషణ.. అంతంతే

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది కేంద్రంలో ఉన్న చిన్నారుల సంఖ్య, కొత్తగా చేరినవారి సంఖ్య ఆధారంగా 45 రోజులకు సరిపడా ఇండెంట్ ఇచ్చేవారు. అలా 15 రోజుల సరుకులు అదనంగా ఉండడంతో కొత్తగా చేరిన వారికి చేరిన రోజు నుంచే పోషణ అందేది. ఆ పరిస్థితి ఇప్పుడు లేకుండాపోయింది.

● నెలాఖరుకు పాలు..

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా మొదటి వారంలో లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నారు. పాలు మాత్రం నెలాఖరు వరకూ రావడం లేదు. అన్ని సరుకులతోపాటు పాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రతి నెలా గుడ్ల సంఖ్య తగ్గుతోంది. గుడ్ల ధరల్లో వచ్చే మార్పును బట్టి గుడ్ల సరఫరా జరుగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు సంస్థ ధర, రవాణా వ్యయంను బట్టి గుడ్ల సంఖ్యను తగ్గిస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ధర పెరిగిన ప్రతి సందర్భంలో గుడ్ల సంఖ్య తగ్గిపోతోందని, ఆ కారణంగా వచ్చిన వాటినే అందరికీ సరిపెడుతున్నామని చెబుతున్నారు.

యాప్‌లను బట్టే ఇండెంట్..

ప్రభుత్వం నిర్వహిస్తున్న యాప్‌లలో నమోదైన వారి సంఖ్య ఆధారంగా ఇండెంట్ ఇస్తున్నాం. నమోదు కానివారికి సరుకులు రావు. అంగన్వాడీ సిబ్బంది ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. వారు సక్రమంగా నమోదు చేస్తే అందరికీ సరుకులు వస్తాయి. సిబ్బంది యాప్‌లను సక్రమంగా నిర్వహించాలి.

-కేవీఎస్.విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, గుంటూరు

ప్లాస్టిక్ రహిత విశ్వవిద్యాలయంగా ఏఎన్‌యూ

పెదకాకాని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు పర్యవేక్షణలో ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, వర్సిటీ స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర నోడల్ ఆఫీసర్ ఆచార్య వి.దివ్య తేజో మూర్తి ఎన్ఎస్ఎస్ వలంటర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత విశ్వవిద్యాలయంగా యూనివర్సిటీని తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సీహెచ్. రవికుమార్, డాక్టర్ సీహెచ్. ఉమాశంకర్, డాక్టర్ పి., యుగంధర్ రెడ్డి, 300 మంది వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం వలంటీర్లను ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఇన్‌చార్జి ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్ వలంటీర్లను అభినందించారు.



వర్సిటీలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



ముఖ్యమంత్రికి సమస్యను చెప్తున్న బాల అంకమ్మరావు దంపతులు

ముఖ్యమంత్రిని కలిసిన బాలఅంకమ్మరావు దంపతులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చీరాలకు చెందిన వల్లెపు బాల అంకమ్మరావు దంపతులు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చీరాల మునిసిపల్, రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఇటీవల చీరాల పరిధిలో దంపతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలో దీనిపై స్థానిక నాయకులు, అధికారుల నుంచి సమగ్ర సమాచారం సేకరించాలని సిబ్బందికి సీఎం సూచించినట్లు దంపతులు తెలిపారు.

శాస్త్ర, సాంకేతికతపై ఆసక్తి కలిగేలా బోధన చేయాలి



కొండమంజులూరు స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు బోధనాపరమైన అంశాలపై సూచనలిస్తున్న బాపట్ల డిప్యూటీ ఈవో వెంకటరావు

పంగులూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తి కలిగేలా పాఠ్యాంశ బోధన కొనసాగించాలని బాపట్ల డిప్యూటీ ఈవో గల్లా వెంకటరావు కోరారు. మండలంలోని కొండమంజులూరు, పంగులూరు, చందలూరు ఉన్నత పాఠశాలల్లో శనివారం ఆయా క్యాడర్ల ఉపాధ్యాయులకు సముదాయ శిక్షణ తరగతులు నిర్వహించారు. కొండమంజులూరులో జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌లో బాపట్ల డిప్యూటీ ఈవో గల్లా వెంకటరావు పాల్గొని పాఠ్యాంశ బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వీరాంజనేయులు, కాంప్లెక్స్ చైర్మన్లు ఐ.అణిత, రమాదేవి, గిరిజ, స్కూల్ హెచ్,యం,లు, ఎస్ఏలు, ఎస్‌జీటీలు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రిడ్ అనుసంధానంపై.. అధ్యయనం

(5వ పేజీ తరువాయి)

కానున్నారు. వాటర్ గ్రిడ్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. పల్లెల కోసం వాటర్ గ్రిడ్ చేపట్టగా దీనిని పట్టణాలకు అనుసంధానం చేస్తుండడంతో పథక వ్యయ అంచనాలను మళ్లీ రూపొందిస్తున్నారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందిస్తారు. సీఎం నారా చంద్రబాబునాయుడు వాటర్ గ్రిడ్‌పై ఇంజనీర్లతో రానున్న వారంలో సమీక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

నిలిచిన పనులకూ అంచనాలు

మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆయా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక పల్నాడు జిల్లాలోనూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకానికీ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేయలేదు. ఈ పథకాన్ని అటకెక్కించింది. ఈ పరిస్థితుల్లో అటు అమృత్, ఇటు వాటర్‌గ్రిడ్ పథకాల్లో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం వ్యయ అంచనాలను రూపొందించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా డీపీఆర్‌లను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆమోదించింది. కేంద్రం, రాష్ట్రప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం నిధులు సమకూర్చనున్నాయి. రూ.783.39 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. ఈ పనులు అమృత్ నిధులతో చేపడతారు. అయితే అమృత్ పనులను వాటర్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి అటు పల్లెల్లో, ఇటు మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా అధ్యయనానికి అధికారులను ఆదేశించింది. సాగర్ నుంచి ఏ ప్రాంతానికి ఎంత సామర్థ్యం కలిగిన పైపులైన్లు అవసరమో అధికారులు నిర్ధారిస్తారు.

అమృత్.. జలజీవన్ మిషన్ నిధులు అందుబాటులో

వాటర్ గ్రిడ్‌కు అమృత్ 2.0 జలజీవన్ మిషన్ పథకం నుంచి నిధులు సమకూరనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలకు పెద్దపీట వేస్తోంది. జలజీవన్‌ను 2028 వరకు పొడిగించింది. మున్సిపాల్టీలకు అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. పట్టణాల్లో అమృత్ కింద రూ.783.39 కోట్లతో డీపీఆర్‌లు సిద్ధం చేశారు. ప్రతి మున్సిపాల్టీలో నీటి పథకాలను అభివృద్ధి చేయాల్సి ఉండగా వాటర్ గ్రిడ్ వల్ల వ్యయం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నిధులను వాటర్ గ్రిడ్‌కు మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాటర్ గ్రిడ్‌తో పట్టణాలు, పల్లెలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

పోషణ.. అంతంతే

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది కేంద్రంలో ఉన్న చిన్నారుల సంఖ్య, కొత్తగా చేరినవారి సంఖ్య ఆధారంగా 45 రోజులకు సరిపడా ఇండెంట్ ఇచ్చేవారు. అలా 15 రోజుల సరుకులు అదనంగా ఉండడంతో కొత్తగా చేరిన వారికి చేరిన రోజు నుంచే పోషణ అందేది. ఆ పరిస్థితి ఇప్పుడు లేకుండాపోయింది.

నెలాఖరుకు పాలు

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా మొదటి వారంలో లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నారు. పాలు మాత్రం నెలాఖరు వరకూ రావడం లేదు. అన్ని సరుకులతోపాటు పాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రతి నెలా గుడ్ల సంఖ్య తగ్గుతోంది. గుడ్ల ధరల్లో వచ్చే మార్పును బట్టి సరఫరా జరుగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు సంస్థ ధర, రవాణా వ్యయంను బట్టి గుడ్ల సంఖ్యను తగ్గిస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ధర పెరిగిన ప్రతి సందర్భంలో గుడ్ల సంఖ్య తగ్గిపోతోందని, ఆ కారణంగా వచ్చిన వాటినే అందరికీ సరిపెడుతున్నామని చెబుతున్నారు.

యాప్‌లను బట్టే ఇండెంట్

ప్రభుత్వం నిర్వహిస్తున్న యాప్‌లలో నమోదైన వారి సంఖ్య ఆధారంగా ఇండెంట్ ఇస్తున్నాం. నమోదు కానివారికి సరుకులు రావు. అంగన్వాడీ సిబ్బంది ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. సక్రమంగా నమోదు చేస్తే అందరికీ సరుకులు వస్తాయి. సిబ్బంది యాప్‌లను సక్రమంగా నిర్వహించాలి. - కేవీఎస్.విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, గుంటూరు.

విజన్ బిల్డింగ్‌తో ప్రయోజనం..అభివృద్ధి

2047తో చిగురిస్తున్న పేదింట ఆశలు



శిక్షణ ఇస్తున్న ఏసీ సుబ్బారావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మహిళలు ప్రగతి పథంలో ఉంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని నినదించింది. అలాగే గ్రామ స్థాయిలో ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ అంశాలను ప్రణాళిక చేస్తూ విజన్-2047 ప్రారంభించి పొదుపు సంఘాల ద్వారా ఆయా గ్రామాల్లో అవసరాలున్న మౌలిక వసతుల కల్పనకు నివేదికను సిద్ధం చేయనున్నారు. అలాగే మహిళల ఆర్థిక స్వావలంబన కోసం టైలరింగ్, వ్యాపార దుకాణాలకు రుణాలను అందించి ఉపాధి అవకాశాలను పెంచనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఫేజ్-1లో భాగంగా బల్లికురవ, భట్టిప్రోలు, చీరాల, కొరిశపాడు, ఇంకొల్లు, నిజాంపట్నం, పిట్లవానిపాలెం, రేపల్లె, చుండూరు, యద్దనపూడి, అద్దంకి, అమృతలూరు, చినగంజాం, పర్చూరు మండలాలను ఎంపిక చేశారు. అందుకు అనుగుణంగా గత మూడు రోజులుగా ఎంపికైన మండలాలకు చెందిన వెలుగు ఏపీఎం, సీసీలకు డీఆర్‌డీఏ పీడీ పద్మ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన అధికారులు ఆయా మండలాల్లోని పొదుపు సంఘాలకు శిక్షణ ఇచ్చి అవసరాలను గుర్తిస్తారు. ఎంపికైన యూనిట్లకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. దీంతో సమాఖ్యల అభివృద్ధి సాధ్యమవుతుంది. వీరు పొందిన రుణాల చెల్లింపులో వచ్చిన వడ్డీని పెద్ద మొత్తంలో అభివృద్ధికి ప్రణాళిక చేసేందుకు వీలుంటుంది.

మూడు రోజుల శిక్షణతో బంగారు భవిత



మూడు రోజులుగా శిక్షణ పొందుతున్నాం. దీంతో పొదుపు సంఘాల ఆర్థిక ఉపాధికి వెసులుబాటు ఉంటుంది. అలాగే రుణ సాయం ద్వారా వచ్చిన వడ్డీతో అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

- బుజ్జి, సీసీ, సాల్మన్ సెంటర్ క్లస్టర్

రహదారి భద్రత అందరి బాధ్యత

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత అందరి బాధ్యత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధలను పాటించాలని సూచించారు. స్థానిక రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపవద్దన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని వివరించారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వాహనచోదకులు రోడ్డు భద్రత నిబంధలను విధిగా పాటించాలన్నారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల నెల రోజుల్లో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, రైజ్ కాలేజీ ప్రిన్సిపాల్ భాస్కరరావు, మార్కాపురం ఆర్టీవో అమర్ నాయక్, వాహన తనిఖీ అధికారులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌లతో పొంచి ఉన్న ముప్పు



రక్షణ వలయం లేకుండా పర్చూరులోని శారదా హైస్కూల్ సమీపంలో, పోలీసు స్టేషన్ ఎదురుగా, ప్రధాన కూడలిలో, నాగులపాలెం హైస్కూల్ సమీపంలోని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు

- రక్షణ చర్యలు తీసుకోవడంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం
- ప్రజల ఆందోళన

పర్చూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లకు రక్షణ వలయం లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. అయితే వీటికి రక్షణగా కంచెలను వేయలేదు. ఇటీవల పర్చూరు పరిధిలో అనేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు చోటుచేసుకోవడం, పలువురు ప్రాణాలు కోల్పోవడం ప్రజలను కలవరానికి గురిచేస్తుంది. ఆయా ప్రధాన రహదారుల కూడలి నుంచి ప్రైవేటు స్కూల్ బస్సులు చిన్నారులతో రాకపోకలు సాగించడం ఆందోళనకరంగా మారింది. పర్చూరులోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారితోపాటు, ఆయా పాఠశాలలకు వెళ్లే ప్రధాన కూడలిగా ఉన్న శారదా హైస్కూల్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు లేక ప్రమాదకరంగా ఉంది. దశాబ్దకాలాలు గడుస్తున్నా విద్యుత్ వైర్లను మార్చక పోవడం, దెబ్బతిన్న ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేసి దెబ్బతిన్న ఇనుప స్తంభాలను మాత్రం అలానే ఉంచారు. దీంతో ఎప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఏం ప్రమాదాలు ముంచుకొస్తాయోనని ప్రజలు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వైర్లు సాగిపోయి కిందికి జారి వేలాడుతున్నాయి. మనిషి పట్టుకునే దూరంలో ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. సమస్యను విద్యుత్ అధికారులకు విన్నవించుకుంటున్న పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్కడా ప్రమాదాలు చోటుచేసుకోక ముందే విద్యుత్ శాఖ అధికారులు వాటిపై దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ వలయాలను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

- మీసేవా కేంద్రాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- సాఫ్ట్‌వేర్‌లో సమస్యతో జాప్యం
- త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తామంటున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ ప్రక్రియను సక్రమంగా సాగలేదు. దరఖాస్తులు చేసుకున్న ఆరు నెలల తర్వాత కొత్తకార్డులు ఇస్తామని చెప్తూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ కార్డులు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకు అనుగునంగా నూతన సంవత్సరం కానుకగా కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు చేర్పులు, మార్పులకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతోంది. విషయం తెలియని ప్రజలు రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. వాటి నిర్వాహకులు ఇంకా సైట్ ఓపెన్ కావడం లేదని చెప్పి పంపుతున్నారు.

అధికారులకు పెద్దఎత్తున అర్జీలు

ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండటంతో కొత్తవి కోరుతూ మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడు అందుకోసం అనేక మంది అటు తహసీల్దార్, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు, పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిపోయి ఉంటే అటువంటి వారు కొత్త కార్డుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసఫరాల ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్‌కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీల విషయాన్ని జిల్లా అధికారులు వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆవిషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని, త్వరలోనే ప్రకటన వస్తుందని ఉన్నతాధికారులు చెప్పినట్లు సమాచారం.



భళా.. బాలోత్సవం

జిల్లాస్థాయి బాలోత్సవం శనివారం ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ పాఠశాలలు, డ్యాన్స్ అకాడమీలకు చెందిన చిన్నారులు చేసిన నృత్యాలు, వేషధారణలు, ఏకపాత్రాభినయాలు అదుర్స్ అనిపించాయి.

బయోమెట్రిక్ బేఖాతర్!

- సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు
- పలు ప్రాంతాల్లో మూడో వంతు డుమ్మా
- అనధికారికంగా కొందరు విధులకు గైర్హాజరు
- వారంవారం ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా 70శాతం మించని హాజరు
- పనితీరూ అంతంతమాత్రమే

- జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కలిపి మొత్తం 719 సచివాలయాలు ఉన్నాయి. ఈనెల 3వ తేదీ నుంచి 10 వరకు వారం రోజుల్లో 718 సచివాలయాల సిబ్బంది హాజరు వివరాలు అధికారులకు అందాయి. వాటిలో 6,078 మంది ఉద్యోగులు ఉంటే కేవలం 4,292 మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. దాదాపు 30 శాతం మంది బయోమెట్రిక్ గురించి పట్టించుకోలేదు.
- ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం నగరంలోని గాంధీనగర్, శివప్రసాద్ కాలనీ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీనగర్‌లోని సచివాలయంలో పనిచేసే సెక్రటరీల్లో ఒక్కరు కూడా అక్కడ కన్పించలేదు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ నోటీసులు ఇవ్వాలని నోడల్ ఆఫీసర్ బాషాను ఆదేశించారు.
- జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక మంది విధులకు అతిథులుగా మారారు. మరికొంత మంది సమయపాలన పాటించడం లేదు. ఈ విషయాలను గుర్తించిన ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టినా చాలా మంది బేఖాతరు చేస్తున్నారు. వారంవారం సచివాలయ ఉద్యోగుల హాజరుపై కలెక్టర్ నిర్వహిస్తున్న సమీక్షలో ఈ విషయం స్పష్టమవుతోంది. అధికార వర్గాల సమాచారాన్ని బట్టి జిల్లాలో దాదాపు 30 శాతం మంది సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరును పట్టించుకోవడం లేదన్న విషయం వెల్లడవుతోంది.

ఒంగోలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల తీరులో ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. వారిని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొందరు 'మేమింతే.. మారమంతే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వారు ఏమేరకు విధి నిర్వహణలో సక్రమంగా పనిచేస్తున్నారు, పౌర సేవలు అందించడంలో ఎంత క్రియాశీలకంగా ఉంటున్నారన్న విషయాన్ని అలా ఉంచితే అనేక మంది అసలు సచివాలయానికే రాని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయగా గ్రామీణ ప్రాంతాల్లో 14 మంది, పట్టణాలలో 10 మంది ఉద్యోగులను సగటున నియమించారు. వివిధ శాఖల పనుల కోసం ఈ సిబ్బంది నియామకం జరిగింది. అయితే వారి పర్యవేక్షణ విషయంలో స్పష్టత లేకపోవడం, ఉద్యోగుల వారీ విధుల నిర్వహణపై సరైన శిక్షణ ఇవ్వకపోవడంతో పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పేరుకు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఉన్నప్పటికీ మిగతా సిబ్బంది నియంత్రణ ఆచరణలో సక్రమంగా లేదు.

గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు

ఈ విషయాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈక్రమంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల తరహాలో వీరు కూడా సచివాలయానికి ఉదయం 10 గంటలకల్లా వచ్చి బయోమెట్రిక్ హాజరు వేయాలి. ఒకవేళ వివిధ సర్వేలు, ఇతర పనులకు క్షేత్రస్థాయిలో ఉంటే మొబైల్ యాప్‌లో హాజరు వేయాలి. వారంవారం కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ హాజరును సమీక్షిస్తున్నారు. ప్రభుత్వం కూడా అన్ని జిల్లాల హాజరును పరిశీలిస్తోంది. అయినా అనేక మంది బయోమెట్రిక్ హాజరును బేఖాతర్ చేస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ నిర్వహించే సమీక్ష నివేదికలను పరిశీలిస్తే బయోమెట్రిక్ హాజరును సచివాలయ ఉద్యోగులు ఏస్థాయిలో బేఖాతరు చేస్తున్నారన్న విషయం అర్థమవుతోంది.

70.76 శాతం మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు

జిల్లాలో ఉన్న 719 సచివాలయాలలో నెట్ సౌకర్యం లేనివి 11 ఉన్నాయి.



ఒంగోలులోని సచివాలయం

వాటిలో రిజిస్టర్ హాజరు నమోదు చేయాలి. అందిన సమాచారం మేరకు 718 సచివాలయాలలోని మొత్తం 6,078 మంది ఉద్యోగులలో ఈనెల 3తో ముగిసిన వారానికి 70.76 శాతం మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. 10వతేదీతో ముగిసిన వారానికి 70.62 శాతంతో 4,292 మంది మాత్రమే హాజరైనట్లు సమాచారం. ఆయా ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఎస్.ఎన్.పాడు మండలంలో గరిష్ఠంగా 3వ తేదీ నాటికి 47.27 శాతం హాజరు ఉంది. 10వతేదీ నాటికి 51.35 శాతానికి మెరుగుపడింది. ఈ మండలంలో రెండు సచివాలయాలు ఆఫ్‌లైన్‌లో ఉన్నాయి. ఇక ఈ నెల 10 నాటికి వారం రోజుల హాజరు శాతాన్ని పరిశీలిస్తే అర్ధవీడు మండలంలో 50 శాతం మంది హాజరు మాత్రమే కనిపిస్తోంది. ఆ మండలంలోని 8 సచివాలయాల్లో నాలుగు చోట్ల మాత్రమే ఆన్‌లైన్ సౌకర్యం ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక అన్ని సచివాలయాలకు నెట్ సౌకర్యం ఉన్నప్పటికీ కొత్తపట్నం మండలంలో 15 సచివాలయాల పరిధిలో 139 మంది ఉద్యోగులు ఉంటే 56.12 శాతంతో 78 మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. పెద్దారవీడులో 62.04 శాతం, తర్లుపాడులో 65.03, పొదిలిలో 65.48, కురిచేడులో 65.48, సింగరాయకొండలో 65.97, ఒంగోలు రూరల్‌లో 66.02 శాతం హాజరు ఉంది. పట్టణాలలో పరిశీలిస్తే.. మార్కాపురం పట్టణంలో 81.87 శాతం మంది హాజరు ఉండగా ఒంగోలులో 74.92, చీమకుర్తిలో 72.68, కనిగిరిలో 72.58, గిద్దలూరులో 79.78 శాతం కనిపిస్తోంది. సెలవులో ఉండేవారు సైతం మొబైల్ ఫోన్‌లో ఆ విషయం నమోదు చేసే అవకాశం ఉన్నప్పటికీ అనేక మంది అలా చేయకుండా అనధికారికంగా గైర్హాజరవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అంశాన్ని కలెక్టర్ అన్సారియా ఏడు రోజుల క్రితం వీసీలో గుర్తించి అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు.

నాణ్యమైన విద్యా బోధన చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేయాలని జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటరు సత్యసాగర్ అన్నారు. శనివారం యద్దనపూడి పాఠశాల క్లస్టరు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంప్లెక్స్ ఛైర్మన్ ఎం.దేవేంద్రరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపి పాల్గొన్నారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంప్

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) :చీరాల ఆర్వోబీ సమీపంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. 9:30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ క్యాంపులో ఎముకలు, కీళ్లు, మోకాళ్లు, భుజాలు నొప్పికి పరీక్షలు చేస్తారు.

జిల్లా అధికారులకు జర్నలిస్టుల ఫిర్యాదు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాలలో వైద్యులు జర్నలిస్టులను చులకన భావంతో చూస్తున్నారని ఆరోపించారు. ఈక్రమంలో శనివారం జేసీ ప్రకర్‌జైన్, డీసీ శేషకుమార్‌ను వేర్వేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

మంత్రి ఆదేశించినా నీటిని చల్లడం లేదు


బల్లికురవలో గ్రానైట్ లారీలు వెళ్తున్న సమయంలో లేస్తున్న దుమ్ము


నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీ వద్ద దెబ్బతిన్న రోడ్డుపై నుంచి వస్తున్న ధూళి

- దుమ్ముతో అల్లాడుతున్న ప్రజలు
- బల్లికురవ నుంచి నక్కబొక్కలపాడు వరకు గ్రానైట్ లారీల తాకిడికి లేస్తున్న ధూళి
- రోడ్డును తడపాలని నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీవాసుల వినతి
- ఆందోళనలో ప్రయాణికులు

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రం నుంచి నక్కబొక్కలపాడు వరకు ఉన్న రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో గ్రానైట్ లారీల రవాణాతో లేస్తున్న దుమ్ముతో కిడ్నీలు దెబ్బతింటున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగే వరకూ రోడ్డుకు నీటిని చల్లించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పది రోజుల కిందట అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంత వరకు నీటిని చల్లించే పనులు మొదలు కాలేదు. ఈ రోడ్డులో నిత్యం వందలాది గ్రానైట్ ముడిరాయి లారీలు మార్టూరు వరకు వెళుతుంటాయి. ఈ వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు నుంచి లేస్తున్న దుమ్ము గృహాలలోకి వెళుతుందని ఈ ప్రభావంతో డస్టు అలెర్జీలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీకి వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పలువురు కలిసి తమకు దుమ్ము బాధ నుంచి విముక్తి కల్పించాలని త్వరగా రోడ్డు నిర్మాణం లేయాలని, రోడ్డు వేసే వరకు ప్రతి రోజు ట్యాంకర్ల ద్వారా నీటిని రోడ్డుకు చల్లించాలని వారు ఆయనకు విన్నవించారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి మండల పరిషత్ ఎంపీడీవో కుసుమకుమారికి రోడ్డుకు నీటిని చల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు నీటిని చల్లించేందుకు నిధులు ఎలా సమకుర్చాలా అనే అలోచనలో ఉన్నారు. రోడ్డుపై నిత్యం తిరిగే గ్రానైట్ లారీలు, ఫ్యాక్టరీల యజమానులు అందరు కలిసి వేసవి కాలం ముగిసే వరకు బల్లికురవ నుంచి నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీ వరకు దుమ్ము లేవకుండా నీటిని చల్లించేలా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో ముందు గ్రానైట్ లారీ వెళుతుంటే వెనుక వచ్చే వారు కొంత సేపు కనిపించనంత దుమ్ము వస్తుందని ప్రజలు వాపోతున్నారు. రానున్న వేసవి ఎండల ప్రభావంతో మరింత రోడ్డు నుంచి దుమ్ము లేచే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దుమ్ము ప్రభావంతో నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనికి చెందిన పలువురుకి అనారోగ్యం బారిన పడ్డారని వారు అంటున్నారు. కిడ్నీలు చెడిపోతున్నాయని పలు రకాల అంటు వ్యాధులు వస్తున్నాయని వారు తెలిపారు. అధికారులు వెంటనే రోడ్డు నుంచి దుమ్ము లేవకుండా ప్రతి రోజూ మూడు పూటలా నీటిని చల్లించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.


పంగులూరులో ఇంకుడు గుంత పనులను పరిశీలిస్తున్న ఏపీవో సంతోషం

ఇంకుడు గుంత పనులను చేపట్టాలి

పంగులూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ లే అవుట్లలో నిర్మితమైన గృహ సమాదయాల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సంతోషం అన్నారు. సచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంగులూరులో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శనివారం ఏపీవో పరిశీలించారు. మండలంలోని పంగులూరు, కొండమూరు గ్రామాలలో 23 ఇంకుడు గుంతలను గ్రౌండింగ్ చేసినట్లు ఏపీవో తెలిపారు. లబ్ధిదారులు ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీవో సూచించారు. కార్యక్రమంలో ఈసీ మురళి, టెక్నికల్ అసిస్టెంట్ సుధారాణి, ఎఫ్ఎ వెంకటేష్ పాల్గొన్నారు.

బాలబాలికలకు హోమియో మాత్రల పంపిణీ



హోమియా మందులను వేయిస్తున్న డాక్టర్ అంజమ్మ

మార్టూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మార్టూరులోని అంబేడ్కర్‌నగర్‌లో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హోమియా మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మార్టూరు హోమియా ఆస్పత్రి వైద్యులు అంజమ్మ, సిబ్బంది తనూజ, కాంపౌండర్ శేషసాయి, ఎస్‌కే ఖాజాబీ పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న రెండు మోటార్ బైకులు ఢీకొనడంతో ఇద్దరు గాయాలయ్యాయి. ఈఘటన శనివారం బల్లికురవ గ్రామంలో జరిగింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన బొంతా శ్యాంబాబు సెంటర్‌కు వచ్చి బైకుపై ఇంటికి వెళుతుండగా, అంబడిపూడి నుంచి బల్లికురవ వస్తున్న అఖిల్ బైకు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో శ్యాంబాబు కాలు నుజ్జునుజ్జయి తీవ్రంగా గాయపడ్డాడు, మరో బైకుపై ఉన్న అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షత గాత్రులను 108లో ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు వైద్య శాలకు తరలించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. అర్ధరాత్రి జాతీయ రహదారిలో ఇసుక రవాణా జరుగుతుందన్న సమాచారంతో ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈక్రమంలో రెండు ట్రాక్టర్‌లను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

విద్యతోనే ఉన్నతస్థాయికి మహిళలు

మార్టూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలు విద్యావంతులుగా ఎదగాలని, తద్వారా వారు అన్నిరంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని శ్రీహర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. శనివారం మార్టూరులో శ్రీహర్షిణి విద్యాసంస్థల ప్రాంగణంలో ద్వితీయ ఇంటర్, డిగ్రీ ఫైనల్, 10 వతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా చదువు, కోర్సుల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులు వారి లక్ష్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలన్నారు. అదేవిధంగా యువతులు కోరుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి చదువును నిచ్చెనగా చేసుకోవాలన్నారు. మార్చి నుంచి ఏడుగుండ్ల పాడు వద్ద యువతులు కోసం ప్రత్యేకం గా ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ కాలేజీలను శ్రీహర్షిణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నూతనంగా కాలేజీలను ఏర్పాటు చేస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, సతీష్, నాగూర్‌వలి, విజయభాస్కర్, బోసుబాబు, బెంజిమన్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీని అమలు చేయండి

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చీరాలలో ఉచిత ఇసుక పాలసీను పారదర్శకంగా అమలు చేయాలని పలువురు వైసీపీ నాయకులు కోరారు. ఈసందర్భంగా శనివారం తహసీల్దార్ గోపీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

నీటి వనరుల సరళిని అంచనా వేయండి

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : భూమిలో ఉన్న నీటి తేమ, చెరువులు, పంపింగ్ స్కీముల సరళిని నిశితంగా పరిశీలించి అంచనా వేయాలని సహాయ గణాంకాల అధికారులు రామకృష్ణ, ప్రేమకుమారి, సురేష్ అన్నారు. శనివారం మండల సమావేశ కార్యాలయంలో చీరాల, వేటపాలెం, కారంచేడు మండలాలకు సంబంధించిన వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జల ఉపరితలం, నీటి మట్టం, సాగునీటి కాలువలు, తేమ శాతం, బావులు, గోటపు బావులు, లిఫ్ట్ఇరిగేషన్ వంటి వాటిపై అంచనాలు వేయాలన్నారు. గత ఖరీఫ్‌లో వినియోగించిన నీటి శాతం వంటి వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో మూడు మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు


బల్లికురవ బస్‌స్టాండ్ వద్ద పేరుకుపోయిన చెత్త

తూతూమంత్రంగా స్వచ్ఛాంధ్ర

- ఫొటోలతో ముగించిన అధికారులు
- పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టని అధికారులు
- ఎక్కడ చెత్త అక్కడే


రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాలు


ఎంపీడీవో కార్యాలయంలో ఆరకొరగా ఉన్న చెత్తను తొలగిస్తున్న అధికారులు

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరుతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు తూతూ మంత్రంగా సున్నం చల్లించి శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టిన్లు ఫొటోలకు దిగి వాటిని ఉన్నతాధికారులకు అప్‌లోడ్ చేసి చేతులు దుపులుకుంటున్నారు. మండల కేంద్రంలో పారిశుధ్యం పడకవేసి ఉన్నప్పటికీ ప్రత్యేక శానిటేషన్ డే మాత్రం ఫొటోలకే పరిమితం అయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. బల్లికురవకు నలువైపులా కూడలిలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి ఉండగా, అధికారులు కేవలం మండల కార్యాలయంలో ఉన్న పిచ్చి మొక్కలను తీయించి, 11 గంటల సమయంలో పాఠశాల విద్యార్థులో 10 నిమషాలు ర్యాలీతో కార్యక్రమాన్ని మమ అనిపించారు. పెద్ద ఎత్తున చెత్తను వేస్తున్న దుకాణదారులతో కనీసం అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించలేదు. ఇలాంటి తూతూ మంత్రం కార్యక్రమాలతో స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నూరుశాతం పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి పోషణ్‌బీ, పడాయిబీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణలో కేంద్రాల నిర్వహణ, వారికి అందించాల్సిన పౌష్టికాహారంపై ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.

పిల్లల చదువుపై దృష్టి సారించాలి

పంగులూరు : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలలో అక్షరాస్యతను పెంపొందించి, పాఠశాలకు సంసిద్ధులను చేయడంపై కార్యకర్తలు దృష్టి సారించాలని ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ సూచించారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో మూడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఆరోగ్యం, పోషకాహారంతో పాటు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ శిక్షణలో మండలంలోని 55 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

చినగంజాం : అంగన్‌వాడీ కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఇంకొల్లు ప్రాజెక్ట్ సీడీపీవో టీ.ఝాన్సీ అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర పథకాలైన పోషణ్ భీ, పడాయిబీపై ఇంకొల్లు, చినగంజాం మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. దివ్యాంగ చిన్నారులకు సంబంధిచిన విషయాలపై సంతరావూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కే.వాణిశ్రీ, ఎన్.సుమలత, కే.ఉషాకుమారి, చినగంజాం, ఇంకొల్లు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : మూడురోజులుగా అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. యద్దనపూడిలో జరుగుతున్న శిక్షణకు పర్చూరు సీడీపీవో సుభద్ర ముఖ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి హర్ష, సూపర్ వైజరు సుజాత పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ పద్మజ

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

ఘనంగా స్వచ్ఛాంధ్ర..స్వచ్ఛ దివస్

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలు విధిగా పెంచాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు. డీఎల్‌డీవో పద్మావతి, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో గోపీకృష్ణ అన్నారు. శనివారం చీరాల మండల పరిధిలోని జాండ్రపేట హైస్కూల్ వద్ద స్వచ్ఛ అంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెం పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సెక్రటరీ మేడికొండ భారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు గ్రామంలో చెత్తా చెదారాన్ని తొలగించారు. వీధుల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెంలో..

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం వలన ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందని వేటపాలెం ప్రత్యేక అధికారి రాజా దెబోర, ఎంపీడీవో రాజేష్ అన్నారు. శనివారం వేటపాలెంలో స్వచ్ఛ అంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చెత్తా చెదారాలను తొలగించారు. వర్మీ కంపోస్ట్ తయారీకి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలోసెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యద్దనపూడి, (మార్టూరు) : స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాలలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. యద్దనపూడి మండలంలోని వింజనంపాడు గ్రామంలో మొక్కలను నాటడంతోపాటు, గ్రామస్థులకు చెత్త సేకరణ బుట్టను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాదినేని సుధీర్, పెదరంగారావు పాల్గొన్నారు. యద్దనపూడి గ్రామంలో హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంపీడీవో లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. గన్నవరంలో ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్ రావు,నల్లపనేని రంగయ్యచౌదరి పాల్గొన్నారు. మార్టూరులో కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు.

పంగులూరు : చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డం పింగ్ యార్డులను సంపద కేంద్రాలుగా వినియోగించుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.బాలమ్మ సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగంగా రామకూరు గ్రామంలోని డంపింగ్ యా ర్డ్‌ను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ, ప్రత్యేకాధికారి అనంతరాజు శనివా రం అధికారులతో కలసి పరిశీలించారు. తడి, పొడి చెత్తలను ఇంటివద్దనే వేరు చేసి క్లాప్ మిత్రలకు అందచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డంపిం గ్ యార్డ్ ప్రాంగణంలో మొక్క లు నాటారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.స్వరూపారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివ య్య, ఈవో ఆర్డీ సుమంత్, ఏపీవో సంతోషం, ఈసీ మురళి, కార్యదర్శి శిరీష, వీఆర్వో బాపయ్య, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీ పీ నాయకులు బాచిన చెంచు ప్రసాద్, ఈవో శ్రీనివాసరావు, అర్చక స్వాములు సునీల్, సాంబశివరావు పాల్గొన్నారు.


రామకూరులో డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున ప్రత్యేకాధికారి బాలమ్మ

పర్చూరు : మనిషిలో స్వచ్ఛమైన మార్పు కోసమే స్వచ్ఛ కార్యక్రమం అని హోమియా వైద్యుడు దాసరి చంద్ర శేఖర్ అన్నారు. ఉప్పుటూరులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చినగంజాం : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి కాలనీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలానికి 60 సోపిట్లు(ఇంకుడుగుంతలు) మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. కాలనీవాసులకు చెత్త సేకరణ డబ్బాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఆత్మారావు, రాఘవయ్య, గృ హ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు రాజశేఖర్, బసవ రాణి, ఏపీవో లక్ష్మీదేవి, కారదర్శి అంజయ్య సిబ్బంది పాల్గొన్నారు.


వింజనంపాడులో చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న నాయకులు

విట్ జాతీయ పోటీల్లో సెయింట్ ఆన్స్ ప్రతిభ

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఫెస్టివల్ వాలీబాల్ పోటీలలో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఏకంగా 30 జట్లతో తలపడి విజేతలుగా నిలిచారు. ఈక్రమంలో శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అమరావతిలోని విట్ వర్సిటీ పోటీలు జరగగా ఉత్తమంగా రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణ మూర్తి, డా.సి సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, విజేతలు విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలతో కళాశాల ప్రతినిధులు

మద్రాసు మత్స్యకారులపై ఫిర్యాదు

- హోం మంత్రికి సమస్యను వివరించిన వాడరేపు జాలర్లు
- విచారణ చేస్తామని హామీ

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మద్రాసు తీరం నుంచి తెలుగు రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి ట్రావలర్ బోట్లతో వేట చేస్తున్నారని బాపట్ల జిల్లా చీరాల పరిధిలోని వాడరేవు సముద్రతీర మత్స్యకారులు హోం మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం హోం మంత్రిని మర్యాద పూర్వకంగా మత్స్యకారులు కలిశారు. ఈసందర్భంగా వారు ట్రావలర్ బోట్లతో వేట సాగిస్తున్న ఫొటోలను హోం మంత్రికి అందజేశారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్ర మత్స్యకారులపై మద్రాసు మత్స్యకారులు దాడులకు తెగబడి, వలలు లాక్కుంటున్నారని వివరించారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు. హోం మంత్రిని కలిసిన వారిలో వాడరేవు మత్స్యకార అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షుడు యజ్జల బాబ్జి, సెక్రటరీ కోడా రవి తదితర మత్స్యకారులు ఉన్నారు.


హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు


తీరంలోకి చొరబడిన మద్రాసు బోటు ఫొటో